PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 355 | విజయవాడ, మంగళవారం 25 జులై 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 25 July 2023 | Rs

ఆకలి కేకలు

- కుకీ శిబిరాలలో అరకొరగానే ఆహారం
- సరఫరాలను దోచుకుంటున్న మైతీలు
- కొండెక్కి కూర్చున్న నిత్యావసరాల ధరలు

• లోపలి పేజీలో.. •

ఎపి హైకోర్టు సిజెగా జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

- రాష్ట్రపతి ఆమోదం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను నియమించాలన్న సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ సోమవారం రాత్రి ట్వీట్ చేశారు. జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని జులై 5న సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం సిఫార్సు చేసిన విషయం విదితమే. జస్టిస్ ఠాకూర్ ప్రస్తుతం ముంబయి హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నారు.



కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం గంటి పెదపూడిలో పడవపై ప్రయాణిస్తున్న ప్రజలు

నిలకడగా గోదావరి

- కాటన్ బ్యారేజీ వద్ద 11.30 అడుగుల నీటిమట్టం
- భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- ముంపులోనే లంక గ్రామాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

గోదావరి నదికి వరద నిలకడగా కొనసాగుతోంది. భద్రాచలం వద్ద తగ్గుముఖం పట్టిన గోదావరి ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద పరవళ్లు తొక్కుతోంది. ఇక్కడ వరద ప్రవాహం నిలకడగా ఉంది. సోమవారం సాయంత్రం నాటికి కాటన్ బ్యారేజీ వద్ద 11.30 అడుగులు, భద్రాచలం వద్ద 36.40 అడుగుల నీటిమట్టం నమోదైంది. దీంతో ఆదివారం అర్ధరాత్రే భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. కాటన్ బ్యారేజీకి 9,16,846 ఇన్‌ఫ్లో ఉంది. ఈ బ్యారేజీకి చెందిన 175 గేట్లను పైకి లేపి ఇన్‌ఫ్లోను నేరుగా సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో లంక గ్రామాలను వరద నీరు తాకింది. లోతట్టు ప్రాంతమైన పి.గన్నవరంలో కనకాయిలంక కాజ్‌వే నీట మునిగింది. మామిడికుదురు మండలం అప్పనపల్లి, పెదపట్నం లంక మధ్య పాటరేవు ప్రాంతం నీటమునిగాయి. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ముక్కామల వద్ద గోదావరి పెరగడంతో లంకల్లోకి రాకపోకలు స్తంభించాయి. గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో అన్ని రేవులు, స్నానఘట్టాలను మూసేశారు. ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలోని కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై కాజ్‌వే, ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగు కాజ్‌వేపై ఇంకా వరద నీరు తగ్గలేదు. దీంతో ఆరు రోజులుగా 16 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలంలో గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలైన కనకాయలంక, బాడవ, పెదలంక, యలమంచిలి లంక, గంగడపాలెం, దొడ్డిపట్ల, బూరుగుపల్లి తదితర గ్రామాల్లోని ప్రజలు భయంభయంగా గడుపుతున్నారు.

పెరిగిన శబరి నీటి మట్టం

చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం కొంతమేర పెరిగి 28 అడుగులకు చేరుకుంది. ఒడిశాలోని పొట్టేరు వాగు పొంగి ప్రవహించడంతో సీలేరు నది ఉగ్రరూపం దాల్చింది. ఆంధ్ర నుండి ఒడిశా వెళుతున్న గుప్తా ట్రావెల్ బస్సు కుయగురు వాగు దాటుతుండగా ప్రవాహంలో చిక్కుకుంది. జెసిబిల సహాయంతో బస్సును ఒడ్డుకు చేర్చారు. అన్నవరం-ఉమ్మడివరం మధ్యలోని బ్రిడ్జి పైకి పొంగటంతో మండలంలోని 40 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మరో వైపు ఐదు రోజులుగా పునరావాస కేంద్రాలు, ఎత్తైన ప్రాంతాల్లో గుడారాలు వేసుకొని తలదాచుకుంటున్న తమను ఏ అధికారి పట్టించుకోలేదని, నిత్యావసర సరుకులు ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం

మిగతా 2లో

నాలుగేళ్లలో వంట గ్యాస్ సబ్సిడీపై రూ.30 వేల కోట్లు కోత



న్యూఢిల్లీ : వంట గ్యాస్ రాయితీ కోసం ఉద్దేశించిన నిధుల్లో కేంద్ర ప్రభుత్వం భారీగా కోత విధించింది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ఒప్పుకుంది. గడిచిన నాలుగేళ్లలో వంట గ్యాస్ సబ్సిడీలో రూ. 30 వేల కోట్లు కోత విధించినట్లు రాజ్యసభ సాక్షిగా పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి రామేశ్వర్ తేలి సోమవారం వెల్లడించారు. సభ్యులు ఏఏ రహీమ్ అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ సమాధానం ఇచ్చారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో వంట గ్యాస్ సబ్సిడీ కోసం రూ.37,209 కోట్లు కేటాయించగా, 2020-21 నాటికి ఈ సబ్సిడీని రూ. 11,896 కోట్లుకు తగ్గించారు. ఇక 2022-23 ఆర్థిక సంవత్సరం నాటికి దీనిని రూ. 6,965 కోట్లుకు తగ్గించినట్లు మంత్రి చెప్పారు. ప్రస్తుతం దేశంలో ఎంత మంది ఎల్‌పిజిని ఉపయోగిస్తున్నారో అన్న గణాంకాలు కేంద్రం వద్ద లేవని మంత్రి సమాధానం ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తుంది. 12 ఏళ్ల క్రితం జనాభా లెక్కల ఆధారంగానే ఇప్పటికీ విశ్లేషణ జరుగుతుందని మంత్రి చెప్పారు. బిపిఎల్ కుటుంబాలకు ఉచితంగా ఎల్‌పిజి కనెక్షన్లు ఇస్తామని హామీ ఇచ్చిన బిజెపి దానికి విరుద్ధంగా రాయితీ నిధుల్లో భారీగా కోత పెట్టడాన్ని రహీమ్ విమర్శించారు.

మణిపూర్‌పై

భగ్గుమన్న పార్లమెంటు

ప్రధాని ప్రకటనకై పట్టుబట్టిన ప్రతిపక్షాలు

- స్వల్పకాలిక చర్చతో సరిపుచ్చాలని ప్రభుత్వ యత్నం
- మూడో రోజూ స్తంభించిన ఉభయ సభలు
- గాంధీ విగ్రహం వద్ద ప్రతిపక్ష ఎంపిల ఆందోళన
- ఆప్ రాజ్యసభ నేత సంజయ్ సింగ్ సస్పెన్షన్



పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష ఎంపిలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మణిపూర్ హింసాకాండ పార్లమెంటును వరుసగా మూడో రోజూ కుదిపేసింది. హత్యలు, అమానుష అకృత్యాలతో తల్లడిల్లుతున్న మణిపూర్‌లో పరిస్థితిపై ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. ప్రభుత్వం ఎంతకీ దిగిరాకపోవడంతో ఉభయ సభల్లోనూ ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. దీంతో పలు మార్లు వాయిదా పడి చివరికి మంగళవారానికి పూర్తిగా వాయిదా పడ్డాయి.

అంతకుముందు ఆప్ రాజ్యసభ నేత సంజయ్ సింగ్‌ను ఈ సమావేశాలు ముగిసేంతవరకు సస్పెండ్ చేస్తున్నట్లు చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ప్రకటించడం ప్రతిపక్షాలకు పుండు మీద కారం చల్లినట్టయింది. మణిపూర్‌లో భయానక పరిస్థితిపై దేశమంతా ఆందోళనతో ఉంటే బిజెపి ఎంపీలు అంతగా ప్రాధాన్యత లేని అంశాలను ముందుకు తెచ్చి దీనిపై చర్చించాలని నోటీసులిచ్చారు. అధికార పక్ష సభ్యులు ఇచ్చిన నోటీసులను సాకుగా చూపి ప్రతిపక్షాల డిమాండ్‌ను రెండు సభల్లోనూ సభాధిపతులు తోసిపుచ్చారు. రాజస్థాన్, పశ్చిమబెంగాల్‌లో దాడులు, పాట్నాలో ఆందోళనపై పోలీసుల దాడి, చత్తీస్‌గఢ్‌లో నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు, రాజస్థానాలో శాంతి భద్రతలపై బిజెపి ఎంపీలు ఇచ్చిన 11 నోటీసులు తన పరిశీలనలో ఉన్నందున మణిపూర్ హింసపై సిపిఎం ఎంపి వి శివదాసన్ ఇచ్చిన నోటీస్‌ను తిరస్కరిస్తున్నట్టు రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ తెలిపారు. రూల్ 267 కింద 27 నోటీసులు తన వద్దకు వచ్చాయని, మల్లికార్జున ఖర్గే, జాన్ బ్రిట్టాస్, ఎడి సింగ్ వంటి నోటీసులు ఇచ్చిన ఎంపిల పేర్లను చదువుతున్న సందర్భంలో టిఎంసి ఎంపి డెరిక్

మిగతా 5లో

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పండి

- రాష్ట్రపతికి ఆదివాసీ రచయితల లేఖ
- అమిత్ షా, బీరేన్ రాజీనామాలు కోరండి : ఎన్‌ఎపిఎం వినతి

• లోపలి పేజీలో.. •

సామాజిక రాజధానిగా అమరావతి

- ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన సభలో సిఎం జగన్

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి, తుళ్లూరు

రాజధాని అమరావతి ఇక మీదట అందరిదిగా మారుతుందని ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజధాని గ్రామాల్లో ఎన్నో అవరోధాలను అధిగమించి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు, ఇతర పేద వర్గాలకు ఇళ్లు నిర్మిస్తున్నామని, తద్వారా సామాజిక రాజధానిగా పునాది రాయి వేశామని ఉద్ఘాటించారు. రాజధాని ప్రాంతంలో ప్రభుత్వం ఇటీవల ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన నేపథ్యంలో మంగళగిరి మండలం కృష్ణాయపాలెంలో గృహ నిర్మాణ శాఖ ద్వారా 25 ఇడబ్ల్యుఎస్ లేఅవుట్లలో రూ.1,829.57 కోట్ల వ్యయంతో అన్ని మౌలిక వసతులతో 50,793 ఇళ్ల నిర్మాణానికి, 45 సామాజిక వసతుల ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి సోమవారం శంకుస్థాపన చేశారు. నమూనా గృహాలను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులకు గృహ నిర్మాణ అనుమతి పత్రాలు అందజేశారు. ఆ తర్వాత వెంకటపాలెంలో జరిగిన సభలో పాల్గొన్నారు. ఈ సభలో కూడా మరికొంతమంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ పేదల శత్రువులతో ఎంతో సంఘర్షణ తర్వాత ఎన్నో అవరోధాలను అధిగమించి పేదల విజయంతో జరిగిన కార్యక్రమంగా ఈ ఘట్టం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు, నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా, ఇళ్లు నిర్మించనీయకుండా అడ్డు తగిలిన చంద్రబాబు నాయుడు, ఆయన కోటరీతో పోరాడామన్నారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా హైకోర్టు, సుప్రీంకోర్టులలో కేసులు వేస్తే వాటి నుంచి ఉపశమనం పొందేందుకు మూడేళ్లుపట్టిందని తెలిపారు. పేదల వ్యతిరేకులంతా హైకోర్టులో 18 కేసులు, సుప్రీం కోర్టులో ఐదు కేసులు వేశారన్నారు. కేవలం పేదవాడికి ఇళ్లు, ఇంటి స్థలం రాకూడదని ఇంతమంది కలిసి ఇన్ని కేసులు వేశారని విమర్శించారు. న్యాయ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కేసు గెలవడంతో అనుమతులు తెచ్చుకుని పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. ఇది పెత్తందార్ల మీద పేదవాడి విజయమని అభివర్ణించారు. పట్టాల పంపిణీ తర్వాత కేంద్ర ప్రభుత్వంలో అన్ని స్థాయిల్లో ప్రయత్నించి ఇళ్ల నిర్మాణానికి నిధులు రాకుండా చేశారని విమర్శించారు. గతంలో కొంతమందికే పరిమితం అయిన అమరావతి ఇక మీదట అందరిదీగా ఉంటుందని, సామాజిక రాజధానిగా మారుతుందని అన్నారు. ఇక్కడి పేదలంతా ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఆప్షన్-3 అమలు చేయాలని కోరారని తెలిపారు. ఇందుకనుగుణంగా 50,793 ఇళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో పేదలకు 30 లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తుంటే టిడిపి నాయకులు అనేక చోట్ల కేసులు వేశారన్నారు. సచివాలయాల, వలంటీర్ల వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలతోపాటు ప్రభుత్వ కార్యక్రమాలను పారదర్శకంగా నిర్వహిస్తుంటే చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్ర మంత్రులు ఆదిమూలపు సురేష్, జోగి రమేష్, విడదల రజనీ, అంబటి రాంబాబు, ఎంపి నందిగం సురేష్, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న సిఎం జగన్

నల్ల జెండాలతో రాజధాని రైతుల నిరసన

• లోపలి పేజీలో.. •

వాన్‌పిక్ భూములు రైతులకివ్వండి

- వి. శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి- చీరాల (బాపట్ల జిల్లా)

వాన్‌పిక్ పేరుతో సేకరించిన భూములను తిరిగి రైతులకు, వాస్తవ సాగుదారులకు వెనక్కి ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. వేటపాలెం, చిన్నగంజాం మండలాల్లో వాన్‌పిక్ కోసం సేకరించిన భూములను సోమవారం ఆయన పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడారు. అనంతరం చీరాలలోని సిపిఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2008లో పేద రైతుల నుండి 26 వేల ఎకరాలను వాన్‌పిక్ కోసం బలవంతంగా తీసుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. 15 సంవత్సరాల కాలంలో పరిశ్రమ ఏర్పాటులో ఏ మాత్రం పురోగతిలేనందున భూములను తక్షణం రైతులకు వెనక్కి ఇవ్వడంతో పాటు, వాటిపై హక్కులను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని కోరారు. రైతులను మోసం చేసి, వారు భారీగా నష్టపోవడానికి కారణమైన కంపెనీపై చర్యలు తీసుకోవాలని అన్నారు. సమైక్య రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం వాన్‌పిక్, లేపాక్షి నాలెడ్జి హబ్ భూములపై వేసిన మంత్రివర్గ ఉపసంఘ సిఫార్సులను వి. శ్రీనివాసరావు గుర్తుచేశారు. పరిశ్రమలు ఏర్పాటు చేయడంలో విఫలమైనందున ఈ రెండిటి కోసం సేకరించిన భూములను రైతులకు ఇవ్వాలని ఉపసంఘం సిఫార్సు చేసిందని చెప్పారు. ఇడి కేసులున్నందున వాన్‌పిక్ విషయంలోఏం చేయలేకపోతున్నామని అప్పట్లో టిడిపి ప్రభుత్వం చెప్పిందని అన్నారు. బాధితులుగా మిగిలిన రైతులకు న్యాయం చేసేందుకు టిడిపి ప్రభుత్వంగానీ, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వంగానీ చేసిందేమి లేదని అన్నారు. ఇటీవలే తెలంగాణ హైకోర్టు ఇడి కేసుల నుండి వాన్‌పిక్ భూములను విడుదల చేసిందని, ఇకనైన రైతులకు పూర్తిహక్కులతో భూములను వెనక్కి ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. భూ సేకరణ సమయంలో ప్రభుత్వంతోపాటు, కంపెనీ కూడా రైతులకు అనేక హామీలిచ్చి, అరచేతిలో వైకుంఠం చూపారని అన్నారు. ఈ 15 ఏళ్ల కాలంలో ఆ హామీలను అమలు చేయకపోవడంతో పాటు, పొలాలకు రైతులను దూరంగా పెట్టడం, మత్స్యకారులను వేటకు నిషేధించడం వంటి చర్యల కారణంగా వేల కోట్ల రూపాయలు స్థానికులు నష్టపోయారని తెలిపారు. వాన్‌పిక్ భూ సేకరణను ఈ శతాబ్దంలోనే అతిపెద్ద కుంభకోణంగా ఆయన అభివర్ణించారు. పట్టా భూమికి ఒక రేటు, పట్టాలేని భూమికి మరో రేటు ఇచ్చారని అన్నారు. భూములిచ్చిన రైతులకు ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఆ రోజు వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ఈ భూములను నిమ్మగడ్డ ప్రసాద్ బ్యాంకుల్లో తనఖా పెట్టి రూ.860 కోట్లు తీసుకున్నారని తెలిపారు. వాడరేవు-నిజాంపట్నం కారిడార్ పేరుతో అభివృద్ధి చేస్తామని, ఎంతోమందికి

మిగతా 2లో



కృష్ణా జిల్లా మచిలీపట్నం కలెక్టరేట్లో బైఠాయించిన ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవిబి.రాజేంద్రప్రసాద్, సర్పంచులు

మా నిధులు మాకు ఇవ్వండి

- మా హక్కులు హరించడం అన్యాయం
- రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచుల ఆందోళన
- కలెక్టరేట్ల వద్ద ధర్నా

ప్రజాశక్తి- యంత్రాంగం

గ్రామ పంచాయతీలకు కేంద్రం నుంచి వచ్చిన ఆర్థిక సంఘం నిధులను పక్కదారి మళ్లించడాన్ని నిరసిస్తూ, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులు సోమవారం ఆందోళనకు దిగారు. కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేశారు. పంచాయతీ నిధులు, సర్పంచుల హక్కులను ప్రభుత్వం హరిస్తోందని

మిగతా 5లో

ఇపిఎఫ్‌పై 8.15 శాతం వడ్డీ

- కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరం 2022-23కు గానూ ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఇపిఎఫ్)పై 8.15 శాతం వడ్డీ చెల్లించడానికి కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించి ఇపిఎఫ్ఒ సోమవారం ఓ సర్క్యులర్ జారీ చేసింది. ఇపిఎఫ్ పథకం-1952లోని 60 (1) పేరా కింద ప్రతి సభ్యుని ఖాతాలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి గానూ వడ్డీ జమ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలియజేసిందని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పనశాఖ తెలియజేసినట్లు తెలిపింది. ఇంత క్రితం ఆర్థిక సంవత్సరానికి (2021-22) ఏకంగా 40 బేసిస్ పాయింట్లు తగ్గించి కేవలం 8.10 శాతం వడ్డీ రేటు మాత్రమే ఇచ్చింది. గత నాలుగు దశాబ్దాల్లో ఇపిఎఫ్ ఖాతాలపై ఇదే అతి తక్కువ వడ్డీ రేటు. 2022-23గానూ ఇపిఎఫ్‌పై 2023 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలోనే వడ్డీ రేటుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా.. ఈ దఫా కేంద్రం ఆలస్యంగా ఆమోదం తెలిపింది. దేశంలోని 7.5 లక్షల కంపెనీలు ఇపిఎఫ్‌లో 7.02 కోట్ల మంది చందాదారులకు సొమ్ము జమ చేస్తున్నాయి.

ఫసల్ బీమాతో ప్రైవేటుకు లబ్ధి

- ఆరేళ్లలో రూ.57 వేలకోట్లు మిగులు
- కొన్ని రాష్ట్రాల్లో రైతుకు ఒక్క పైసా చెల్లించలేదు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాన మంత్రి పంటల బీమా పథకంతో ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు రూ.57,621 కోట్లు లాభం కలిగిందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తెలిపారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పిఎంఎఫ్‌బివై) వల్ల రైతుల కంటే, ప్రైవేటు బీమా కంపెనీలకే లాభం జరుగుతుందని ఎఐకెఎస్ వంటి రైతు సంఘాలు మొదటి నుంచి పేర్కొంటున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం బుకాయిస్తుంది. అయితే గణాంకాలు ఎఐకెఎస్ చెప్పేందే వాస్తవమని పేర్కొంటున్నాయి. మోడీ ప్రభుత్వం 2016లో ప్రారంభించిన పిఎంఎఫ్‌బివై పథకాన్ని బీమా కంపెనీలు ఎక్కువగా ఉపయోగించుకున్నాయి. రాజ్యసభలో కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ ఒక ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో గడిచిన ఏడేళ్లలో బీమా కంపెనీలు రూ.1,97,657 కోట్లను ప్రీమియంగా స్వీకరించాయని, దాదాపు రూ.1,40,036 కోట్లను రైతులకు క్లెయిమ్‌ల రూపంలో చెల్లించాయని పేర్కొన్నారు. సుమారు రూ.57,621 కోట్లు ప్రైవేటు కంపెనీలకు ఆదా అయ్యాయని తెలిపారు.

2022-23లో బీమా కంపెనీలు రూ.27,900 కోట్ల ప్రీమియం పొందాయి. పంట నష్టానికి సంబంధించి రైతులకు కేవలం రూ.5,760 కోట్లు చెల్లించాయి. కొన్ని రాష్ట్రాల్లో ప్రైవేటు బీమా కంపెనీలు రైతులకు ఒక్క పైసా కూడా చెల్లించలేదు. అయినప్పటికీ వందల కోట్లు ప్రీమియం రూపంలో పొందాయి. మధ్యప్రదేశ్‌లో ఒక ప్రైవేటు బీమా సంస్థ రూ.672 కోట్ల ప్రీమియం పొందిందని, అయితే పంట నష్టం క్లెయిమ్ లేదని డేటా వెల్లడించింది. పిఎంఎఫ్‌బివై కింద, రైతులు ఖరీఫ్ సీజన్‌లో బీమా మొత్తంలో నామమాత్రంగా 2 శాతం, రబీలో 1.5 శాతం, రెండు సీజన్‌లలో వాణిజ్య పంటలకు 5 శాతంతోపాటు ప్రీమియంగా చెల్లిస్తారు. మిగిలిన ప్రీమియం మొత్తాన్ని కేంద్రం, రాష్ట్రాలు 50:50 చొప్పున చెల్లిస్తాయి. క్లెయిమ్‌లు చెల్లించకపోవడం, ఆలస్యంగా చెల్లింపులకు సంబంధించి, చాలా ఫిర్యాదులను పరిష్కరించినట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ పేర్కొంది.

పవన్ కల్యాణ్‌పై క్రిమినల్ కేసు

- మహిళా వలంటీర్ ఫిర్యాదును స్వీకరించిన విజయవాడ కోర్టు

• లోపలి పేజీలో.. •

కళ్లకలక కలకలం

- తూర్పు, సిక్కోలులో విజృంభణ
- బాధితుల్లో అధికంగా చిన్నారులు

ఏపి అప్పు రూ.4,42,442 కోట్లు

● కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ అప్పు రూ.4,42,442 కోట్లు, తెలంగాణ అప్పు రూ.3,66,306 కోట్లని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. లోక్‌సభలో బిఆర్‌ఎస్ ఎంపి నామా నాగేశ్వరరావు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఎపిలో 2019లో రూ.2,64,451 కోట్లు (15.3 శాతం), 2020లో రూ.3,07,672 కోట్లు (16.3 శాతం), 2021లో రూ.3,53,021 కోట్లు (14.7 శాతం), 2022లో రూ.3,93,718 కోట్లు (11.5 శాతం), 2023 (బడ్జెట్ అంచనా)లో రూ.4,42,442 కోట్లు (12.4 శాతం) అప్పు ఉన్నట్లు తెలిపారు. తెలంగాణలో 2019లో రూ.1,90,203 కోట్లు (18.7 శాతం), 2020లో రూ.2,25,418 కోట్లు (18.5 శాతం), 2021లో రూ.2,71,259 కోట్లు (20.3 శాతం), 2022లో రూ.3,14,136 కోట్లు (15.8 శాతం), 2023 (బడ్జెట్ అంచనా)లో రూ.3,66,306 కోట్లు (16.6 శాతం) అప్పు ఉన్నట్లు తెలిపింది.

మార్గదర్శి కేసు విచారణ 4కు వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మార్గదర్శి కేసు విచారణ ఆగస్టు 4కు వాయిదా పడింది. ఆంధ్రప్రదేశ్‌లో చిట్స్ (చందాదారుల) మొత్తాన్ని హైదరాబాద్‌కు నిబంధనలకు విరుద్ధంగా తరలించారని ఆరోపిస్తూ మార్గదర్శి చిట్ ఫండ్ కంపెనీపై ఎపి ప్రభుత్వం ఏడు కేసులు నమోదు చేసింది. దీనిని మార్గదర్శి తెలంగాణ హైకోర్టులో సవాల్ చేసింది. తెలంగాణ హైకోర్టు విచారించే పరిధి ఉందని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఎపి ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను సోమవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సిటి రవి కుమార్, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఆంధ్రప్రదేశ్‌లో నమోదైన కేసులపై విచారణ ఆంధ్రప్రదేశ్ పరిధిలోనిదని, తెలంగాణ హైకోర్టు పరిధిలోకి రాదని ఎపి ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదించారు. ఎఫ్ఐఆర్ ఎక్కడ నమోదైనా విచారణ ఎక్కడైనా చేయొచ్చని, ఈ విషయాన్ని 40 ఏళ్ల క్రితమే సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కాజ్ ఆఫ్ యాక్షన్ ఎక్కడ జరిగితే, ఆ హైకోర్టు పరిధిలోకే కేసుల విచారణ వస్తుందని తెలిపారు. గతంలో ఎపి ప్రభుత్వం దాఖలు చేసిన బదిలీ పిటిషన్లతో కలిపి విచారిస్తామని కేసు తదుపరి విచారణ ఆగస్టు 4కు సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

వైసిపి పాలనలో వృక్షాలు విలవిల

● జనసేన అధినేత పవన్‌కళ్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి పాలనలో వృక్షాలు కూడా విలపిస్తున్నాయని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ట్విట్టర్‌లో పోస్టు చేశారు. 'మనకు నీడను అందించడమే కాకుండా ఆహారాన్ని కూడా అందించే చెట్లను మీరు రక్షించనప్పుడు వాటి ఖర్మ ఫలం సిఎం పరిపాలనలో భాగమైన అందరినీ పట్టుకుంటుంది' అని అన్నారు. సిఎం పర్యటనలో చెట్లను నరికి వేయడం అనేది ఒక విచిత్రమైన తీరుగా కనిపిస్తోందని పేర్కొన్నారు. జంధ్యాల పాపయ్యశాస్త్రి 'పుష్ప విలాపం' చదివినప్పుడు, ప్రఖ్యాత శాస్త్రవేత్త జగదీష్ చంద్రబోస్ ప్రయోగాలు అర్థం కానప్పుడు, వృక్షాలను, మొక్కలను నరికేస్తుంటే కలిగే బాధ వాళ్లకు ఎలా తెలుస్తుందని పవన్‌కళ్యాణ్ ప్రశ్నించారు.

కాలపరిమితి ఉత్తర్వులు రద్దు చేయాలి

● ఎపి వెలుగు విఒఎ ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వెలుగులో పనిచేస్తున్న విఒఎ ఉపాధిని దెబ్బతీసే మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని సిఐటియు అనుబంధ సంఘం ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్ల) ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి రాజశేఖర్, సెర్ప్ సిఇఒ ఇంతియాజ్‌కు ఎపి వెలుగు విఒఎ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సావిత్రి, ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి, కోశాధికారి ఎ తిరుపతమ్మ వినతిపత్రం అందజేశారు. అలాగే గ్రామ ఐక్య సంఘాలను విలీనం చేసే ప్రక్రియను నిలుపుదల చేయాలని కోరారు. తక్షణం ఐక్య సంఘాలు పున్యాయనే నెపంతో వేతనంలో కోతపెట్టడం సరైంది కాదని, 15 గ్రాంటును పున్న వేతనం ఇవ్వాలన్నారు. వయసు మీరినవారికి, అనారోగ్యంతో ఉన్నవారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని కోరారు. లోక్ యాప్ వర్క్ కోసం 5జి మొబైల్‌ను అందించాలన్నారు. మహిళా మార్టుల్లో బలవంతపు కొనుగోళ్ల లక్ష్యాలను విరమించడం సరికాదన్నారు. ప్రతి విఒఎకు రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

నిలకడగా గోదావరి

మొదటి పేజీ తరువాయి

సిపిఎం నాయకులు పునరావాస కేంద్రాలను సందర్శించగా, బాధితులు తమ గోడు వెలిబుచ్చారు.

శ్రీశైలానికి నిలిచిన ప్రవాహం

శ్రీశైలానికి నీటి ప్రవాహం నిలిచిపోయింది. ఎగువ జూరాల నుండి విద్యుత్ ఉత్పాదన ద్వారా మధ్యాహ్నం 12 గంటల వరకు 4,776 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా మూడు గంటల సమయానికి పూర్తిగా నీటిని నిలిపివేశారు. నీటిమట్టం 812 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 215 టిఎంసిలకు గాను ప్రస్తుతం 35.47 టిఎంసిలుగా నమోదయింది. ప్రకాశం బ్యారేజీ ఇన్‌ఫ్లో 8307 క్యూసెక్కులు కాగా...అవుట్ ఫ్లో 11,002 క్యూసెక్కులుగా ఉంది. ఐదుగేట్లను ఎత్తి 3685 క్యూసెక్కులు సముద్రంలోకి, 7317 క్యూసెక్కులను కాల్వలకు విడుదల చేస్తున్నారు.

రోగాల కాలం... రూపాయి లేదు...

● పంచాయతీ సర్పంచుల ఆవేదన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆర్థిక సాయం లేక కునారిల్లిపోయిన పంచాయతీలకు ఇప్పుడు మరో కొత్త భయం వచ్చిపడింది. వర్షాకాలంలో గ్రామాల్లో మురుగుకాల్వలు, చెత్త నిర్వహణ వంటి పనులు చేపట్టాలన్నా రూపాయి లేకపోవడంతో సర్పంచులు తీవ్రస్థాయి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ చెత్త తీయించాలన్నా జేబులో డబ్బులు పెట్టుకోవాల్సి వస్తుండటంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పంచాయతీల్లో వర్షాకాలంలో సహజంగానే నిర్వహణ ఖర్చు ఎక్కువగా ఉంటుంది. వాస్తవంగా పంచాయతీలకు కేటాయించే నిధుల్లో 15 శాతం పారిశుధ్య నిర్వహణకు ఖర్చు చేయాలి. అయితే వర్షాకాలంలో ఇది కొంచెం ఎక్కువగానే ఉంటుంది. సహజంగా పంచాయతీల్లో వర్షాకాలం రావడానికి ముందే కాలువల పూడిక తీయించడం, పిచ్చిమొక్కలు తొలగించడం, బ్లీచింగ్ పెట్టుకోవడం, దోమలు రాకుండా ఆయిల్‌బాల్స్ ఏర్పాటు చేసుకోవడం వంటి పనులన్నీ ముందుగానే చేసుకుంటారు. వీటితోపాటు వర్షాకాలంలో సీజనల్‌గా వచ్చే వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. మంచినీటి నిర్వహణ, వర్షాకాలంలో నీరు కలుషితం కాకుండా చూసుకోవడం,



అనంతపురంలో పేరుకుపోయిన మురుగు నీరు (ఫైల్)

బ్లీచింగ్ వంటి పనులన్నీ పంచాయతీ పరిధిలోనే చేయాల్సి ఉంటుంది. అనుకోని విధంగా ఎక్కడైనా అంటువ్యాధులు ప్రబలితే అక్కడ సున్నం జల్లించడం, నిరంతరం సిబ్బందిని పెట్టి పర్యవేక్షించడం వంటి పనులూ సర్పంచులే చేయాలి. ప్రస్తుతం పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి సర్పంచులకు ఏర్పడింది. మరోవైపు కేంద్రం రూ.998 కోట్లు విడుదల చేసి 69 రోజులు దాటిపోతోంది. అయినా పంచాయతీల ఖాతాల్లో రూపాయి పడలేదు. ఎన్నికల సమయంలో ప్రతిష్టకుపోయి పెద్దఎత్తున డబ్బు ఖర్చు చేసి గోళ్లూడగొట్టుకున్న సర్పంచులందరూ నేడు లబోదిబోమంటున్నారు. ఖర్చుపోతే పోయింది కనీసం పనులన్నా జరిగితే గ్రామంలో తలెత్తుకోని తిరగొచ్చని, ఇప్పుడు ఆ పరిస్థితి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వచ్చిన నిధుల్లో సుమారు 336 కోట్లు ఖాతాల్లో వేస్తామని ప్రొసిడింగ్స్ ఇచ్చినా ఇంతవరకు డబ్బులు జమకాలేదని సర్పంచుల సంక్షేమ సంఘం కార్యదర్శి కృష్ణమోహన్ పేర్కొన్నారు. ఇలాగైతే వర్షాకాలంలో పంచాయతీల నిర్వహణ ఎలాగని ఆయన ప్రశ్నించారు. అసలే డబ్బులు లేవనుకుంటుంటే వచ్చిన పన్నుల డబ్బును కూడా వాలంటీర్లు, కార్యదర్శుల వేతనాల పేరుతో మినహాయించుకుంటున్నారని సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాపారావు పేర్కొన్నారు. అంటువ్యాధులు ప్రబలేకాలమని, నిధులు లేకపోతే అదుపు చేయడం కష్టమని,ఖాతాల్లో ఉన్న నిధులు వెనక్కు లాగేసుకుని సర్పంచులను రోడ్డున పడేశారని సర్పంచుల సంఘం నాయకులు వై.వి.బి.రాజేంద్రప్రసాదు వివరించారు. దీనిపై ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే కేంద్రానికి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

చంద్రబాబు కుట్రలను తిప్పికొట్టాం

● మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతి రాజధాని ప్రాంతంలో పేదలకు చోటు వుండకూడదనే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కుట్రలను తిప్పికొట్టి తాము పేదలకు ఇళ్లు ఇస్తున్నామని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుల ముసుగులో టిడిపి పెత్తందారులకు అమరావతి రాజధాని భూములను కట్టబెట్టేందుకు మొగ్గు చూపింది తప్ప పేదలకు సెంటు స్థలం ఇచ్చేందుకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. సింగపూర్ కంపెనీలకు భూములను కట్టబెట్టింది తప్ప పేదలకు ఇవ్వలేదని అన్నారు. అమరావతిలో పేదలకు అవకాశం వుండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక యజ్ఞంలా పనిచేస్తే ఈ ఇళ్ల నిర్మాణానికి మార్గం సుగమమైందన్నారు. పవన్ కల్యాణ్ సినిమాల్లో మాత్రమే హీరో అని రాజకీయాల్లో కమెడియన్ అని విమర్శించారు. అమరావతిలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను ఆరు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు.

పిహెచ్‌సి, సిహెచ్‌సిల్లోనే ప్రసవాలు

● సిఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో/ విజయవాడ

రాష్ట్రంలో సాధ్యమైనంత వరకు ప్రసవాలన్నీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలోనే జరగాలని వైద్యారోగ్య శాఖాధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయంలో సోమవారం వైద్యారోగ్యశాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. కేవలం హై రిస్క్ కేసులను మాత్రమే జిల్లా ఆస్పత్రులకు రిఫర్ చేయాలని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి ఆయా ఆస్పత్రుల వైద్యులు, ఎఎన్ఎమ్, ఆశా వర్కర్లకు లక్ష్యాలను నిర్దేశించి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ పథకంలో 3,257 వివిధ ప్రొసీజర్లు ఉండగా, వాటిలోని సింపుల్ ప్రొసీజర్లన్నీ ప్రభుత్వాస్పత్రులకే పరిమితం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీకి సంబంధించి ఒక్క కేసు కూడా ప్రీ ఆథరేషన్ స్థాయిలో తిరస్కరణకు గురికాకుండా ఉండేలా చూడాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామాల్లో వ్యక్తిగత ఆరోగ్యం పట్ల ప్రజల్లో పూర్తి అవగాహన, కమ్యూనిటీ హెల్త్ పరిస్థితుల్లో మార్పులు రావాలని సిఎస్ పేర్కొన్నారు. గ్రామాల్లో వాటర్‌బోర్న్, వెక్టర్ బోర్న్ సంబంధిత వ్యాధులు బాగా తగ్గాలన్నారు. వర్షాకాలంలో ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, మరుగుదొడ్లను వినియోగించాలనే అవగాహనను కలిగించాలన్నారు. మాతా, శిశు మరణాల సంఖ్య తగ్గాలని, అందరికీ వ్యాధి నిరోధక టీకాలు వేయించి ఉండాలని అన్నారు. అనంతరం కేన్సర్ వ్యాధి నిరోధక చర్యలు, వైద్య కళాశాలలు అంశాలపై సమీక్షించారు. అక్టోబరు 2 నుంచి కేన్సర్ వ్యాధి నిర్ధారణకు స్క్రీనింగ్ టెస్టులు, తలసేమియా వ్యాధి నిర్ధారణకు స్క్రీనింగ్ టెస్టులకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎపి ఎంఎస్ఐడిసి విసి అండ్ ఎమ్‌డి డి మురళీధర్‌రెడ్డి, వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనరు జె నివాస్, ఆరోగ్యశ్రీ సిఇఒ ఎంఎన్ హరీంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'కు సన్నాహకాలు

అక్టోబరు 2 నుంచి నవంబరు 16 వరకు ఆడుదాం ఆంధ్రా పేరిట క్రీడల ద్వారా 3 లక్షల మ్యాచ్‌ల నిర్వాహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సిఎస్ జవహర్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రాపై సిఎస్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. ఆడుదాం ఆంధ్రా ద్వారా క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో మ్యాచ్‌లను నిర్వహించనున్నట్లు తెలిపారు. నాకౌట్ పద్ధతిలో గ్రామ, వార్డు స్థాయి క్రీడలను 7 రోజులు, మండల స్థాయిలో 16 రోజులు, జిల్లా స్థాయిలో 9 రోజులు, రాష్ట్ర స్థాయిలో ఫైనల్స్ 5 రోజులపాటు నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖ క్రీడాకారులైన అంబటి రాయుడు, కరణం మల్లేశ్వరి, పివి సింధు, డి హారిక, శ్రీకాంత్‌ను భాగస్వాములను చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం 2023–28 క్రీడా విధానంపై సిఎస్ ఈ ఉన్నత స్థాయి కమిటీ సమావేశంలో చర్చించారు. సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, శాప్ ఎమ్‌డి హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం తొలిదశకు రూ.12,911 కోట్లు

● రాష్ట్రం ప్రతిపాదించింది రూ.17,144 కోట్లు

● పార్లమెంటులో కేంద్ర మంత్రి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పోలవరం ప్రాజెక్టు తొలిదశలో మిగిలిన పనుల పూర్తికి రూ.12,911 కోట్లు ఇచ్చేందుకు ఆర్థికశాఖలోని వ్యయ విభాగం ఆమోదించినట్లు కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడు తెలిపారు. రాజ్యసభలో సోమవారం వైసిపి ఎంపి వి విజయసాయిరెడ్డి, టిడిపి రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్రకుమార్ పోలవరం ప్రాజెక్టుపై అడిగిన వేర్వేరు ప్రశ్నలకు కేంద్ర మంత్రి బిశ్వేశ్వర్ తుడు సమాధానం చెప్పారు. పోలవరం ప్రాజెక్టు తొలిదశ కింద చేపట్టిన నిర్మాణాల్లో మిగిలిన పనులు పూర్తి చేసేందుకు రూ.17,144 కోట్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించినట్లు తెలిపారు. ఇందులో భూసేకరణ కోసం రూ.2,177 కోట్లు, ఆర్‌అండ్ఆర్ పనుల కోసం రూ.5,217 కోట్లు కలిపి మొత్తం పునరావాసం పనులకు రూ.7,300 కోట్లుగా వుంది. పునరావాసం పనులకు కలిపి రూ.17,144 కోట్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అయితే కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్రం ప్రతిపాదించిన మొత్తం కాకుండా పునరాస, నిర్మాణ పనులకు గానూ 41.15 మీటర్ల వరకు నీటిని నిలువ చేసేందుకు రూ.10,911.15 కోట్లు, వరదలు కారణంగా దెబ్బతిన్న నిర్మాణాల మరమ్మతుల కోసం మరో రూ.2 వేలకోట్లు విడుదల చేయడానికి ఆర్థికశాఖ అంగీకరించిందని కేంద్ర మంత్రి తెలిపారు. పోలవరం నిధులకు సంబంధించి గతంలో తీసుకున్న నిర్ణయాన్ని సవరిస్తూ కేంద్ర మంత్రివర్గం తాజా ప్రతిపాదనలను ఆమోదించాల్సి ఉందని మంత్రి వివరించారు. పోలవరం తొలిదశ నిర్మాణంలో మిగిలిన పనులు పూర్తి చేయడానికి సవరించిన అంచనాల ప్రకారం రూ.17,144 కోట్లు అవసరం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత జూన్ 5న తమకు ప్రతిపాదనలు సమర్పించిందని తెలిపారు. వీటిని త్వరితగతిన పరిశీలించి ప్రభుత్వ ఆమోదం పొందేందుకు తగిన చర్యలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు. అయితే ఈ ప్రక్రియ నిర్దిష్ట కాలపరిమితిలోగా పూర్తి చేయాలని కోరడం సబబు కాదని అన్నారు. పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనా వ్యయానికి సంబంధించి 2022 మార్చి 15న రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనల ప్రాతిపదికన తక్షణం రూ.10 వేల కోట్లు విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి 2022న జులై 15న రాసిన లేఖను కూడా ఆర్థికశాఖ వ్యయ విభాగం పరిగణనలోకి తీసుకున్న పిమ్మటే మొత్తం రూ.12,911 కోట్ల నిధుల విడుదలకు ఆమోదం తెలిపిందని మంత్రి పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టులో తొలిదశ పూర్తికి రాష్ట్రం నుండి రూ.17,144 కోట్లను కోరితే రూ.10,911.15 కోట్లే ఇచ్చినందున పునరావాసం, నిర్మాణం పనులకు వచ్చిన నిధులను నిష్పత్తి ప్రకారం ఖర్చు చేసేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర జలవనరులశాఖ అధికారులు తెలిపారు.

ఎపిలో 13 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన–అర్బన్ (పిఎంఎవైయు) కింద ఆంధ్రప్రదేశ్‌లో మంజూరైన 13,33,606 లక్షల ఇళ్లు ఇంకా నిర్మాణం పూర్తి కాలేదని కేంద్ర పట్టణ వ్యవహారాలశాఖ సహాయ మంత్రి కౌశల్ కిశోర్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు పిఎంఎవైయు కింద 21,32,432 ఇళ్లు మంజూరైతే, అందులో 7,98,826 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. దేశ వ్యాప్తంగా 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు 118.90 లక్షల ఇళ్లు మంజూరైతే 75.31 లక్షల ఇళ్లు మాత్రమే నిర్మాణం పూర్తయ్యాయి. మిలిగిన 43.59 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు.

విజయవాడ, తిరుపతి విమానాశ్రయాల్లో కార్గో ఆపరేషన్స్ నిలిపివేత

విజయవాడ, తిరుపతి విమానాశ్రయాల్లో డొమెస్టిక్ ఎయిర్ కార్గో కార్యకలాపాలను నిలిపేసినట్లు పౌరవిమానయాన శాఖ సహాయ మంత్రి వికె సింగ్ స్పష్టం చేశారు. రాజ్యసభలో వైసిపి ఎంపి వి విజయసాయి రెడ్డి ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తిరుపతి ఎయిర్‌పోర్టులో ఎయిర్ కార్గో రెగ్యులేటెడ్ ఏజెంట్ అభ్యర్థన మేరకు అవుట్ బౌండ్ డొమెస్టిక్ ఎయిర్ కార్గో కార్యకలాపాలను నిలిపేసినట్లు చెప్పారు. అలాగే అన్ని ఎయిర్‌పోర్టులలో కామన్ యూజర్ డొమెస్టిక్ ఎయిర్ కార్గో టెర్మినల్ (సియుడిసిటి) కార్యకలాపాలను నిలిపివేయాలని బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బిసిఎఎస్) తీసుకున్న నిర్ణయం కారణంగా విజయవాడ విమానాశ్రమంలో సైతం డొమెస్టిక్ ఎయిర్ కార్గో కార్యకలాపాలను నిలిపేసినట్లు మంత్రి వివరించారు. విశాఖ విమానాశ్రయం నుంచి మాత్రం అన్ని కార్గో కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతున్నట్లు మంత్రి తెలిపారు. డొమెస్టిక్ ఎయిర్‌కార్గోను స్వయంగా హ్యాండిల్ చేస్తామంటూ ఇండిగో ఎయిర్‌లైన్స్‌ను నిర్వహిస్తున్న ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ సంస్థ ముందుకు వచ్చినందున దీనిపై ప్రతిపాదనలను సమర్పించవలసిందిగా బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ విజయవాడ, తిరుపతి ఎయిర్‌పోర్ట్ అధికారులను కోరినట్లు మంత్రి తెలిపారు.

'జల్‌జీవన్' నిధులను ఎపి వాడుకోలేదు

జల్‌జీవన్ మిషన్ పథకం అమలులో ఎపి ప్రభుత్వం పనితీరు బాగోలేదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను వాడుకోలేదని రాజ్యసభలో కేంద్ర జలశక్తిశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. జల్‌జీవన్ పథకం అమలులో పనితీరు సరిగ్గా లేని రాష్ట్రాల్లో ఎపి ఒకటని కేంద్ర మంత్రి చెప్పారు. 2021 నుంచి పథకం నిధులను ఎపి ప్రభుత్వం వినియోగించుకోలేదన్నారు. ఈ మేరకు బిజెపి ఎంపి జివిఎల్ నరసింహారావు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు.



వెంకటపాలెంలో కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న రాజధాని రైతులు

నల్ల జెండాలతో రాజధాని రైతుల నిరసన

ప్రజాశక్తి- తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని గ్రామాల్లో ఇతర ప్రాంతాల వారికి ఇళ్ల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ రాజధాని రైతులు, రైతు కూలీలు, మహిళలు దీక్షా శిబిరాల్లో నల్లజెండాలు, నల్ల బెలూన్లతో నిరసన తెలిపారు. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తుళ్లూరు, వెంకటపాలెం దీక్షా శిబిరంలో మహిళా రైతులు కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెల్లుబాటు కాని ఇళ్లు నిర్మించి పేదలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం సభ ముగిసిన అనంతరం సభాస్థలి నుంచి బస్సులు తిరిగి వెళ్తున్న సమయంలో దీక్షా శిబిరం నుంచి రైతులు, మహిళలు రోడ్డుపైకి వచ్చి వర్షంలో నిరసన తెలిపారు. మందడం దీక్షా శిబిరంలో నిరసన తెలిపిన రైతులు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఓట్ల కోసమే రాజధానిలో ఇళ్ల స్థలాల పంపిణీ అంటూ ఆర్భాటం చేస్తున్నారని విమర్శించారు. సిఎం సభ నేపథ్యంలో దళిత జెఎసి నాయకులు పులి చిన్న, మరికొందరిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. తాము కోర్టుకు హాజరు కావాల్సి ఉందని చెప్పడంతో సిఎం కార్యక్రమాలు జరుగుతున్న మార్గంలో కాకుండా వేరే మార్గంలో వెళ్లాలని సూచించి వారిని విడిచిపెట్టారు.



యువగళం పాదయాత్రలో మాట్లాడుతున్న నారా లోకేష్

గ్రానైట్ పరిశ్రమను ఆదుకుంటాం

● టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబు

ప్రజాశక్తి-చీమకుర్తి (ప్రకాశం జిల్లా)

తాము అధికారంలో వచ్చిన వెంటనే గ్రానైట్ పరిశ్రమ సమస్యలన్నీ పరిష్కరిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబు హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్రలో భాగంగా సోమవారం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. వైసిపి హయాంలో గ్రానైట్ పరిశ్రమ సంక్షోభంలో పడిందన్నారు. కరెంటు ఛార్జీలు, రాయల్టీ తగ్గిస్తామని ఎన్నికల హామీలు ఇచ్చిన జగన్ మోహన్‌రెడ్డి వాటిని తుంగలో తొక్కారని విమర్శించారు. చీమకుర్తి ప్రాంతంలో ఇఎస్ఐ ఆస్పత్రి కట్టిస్తానని చీమకుర్తి ప్రాంత ప్రజలను, టన్నుకు రూ.5000 ఇస్తానని, ఎఎంసిల ద్వారా కర్ర కొనుగోలు చేస్తామని చెప్పి రైతులను జగన్ మోహన్ రెడ్డి మోసం చేశారని విమర్శించారు. టిడిపి అధికారంలో వచ్చాక రాగానే విద్యుత్ ఛార్జీలు, గ్రానైట్ రాయల్టీని తగ్గిస్తామని, యజమానులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. సుబాబుల్ రైతులను ఆదుకుంటామన్నారు. నియోజకవర్గంలోని రామతీర్థం, గుండ్లకమ్మ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఒంగోలు డెయిరీని ప్రారంభిస్తామని, గుండ్లకమ్మ ప్రాజెక్టు కింద కీర్తిపాడు, ఉప్పలపాడు నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. చీమకుర్తి మున్సిపాలిటీలో ప్రతి ఇంటికి వాటర్ గ్రిడ్ పథకం ద్వారా సురక్షిత తాగునీరు అందిస్తామని తెలిపారు. ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని, అవినీతి జగన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని కోరారు. కార్యక్రమంలో సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల డిమాండ్లు నెరవేరుస్తాం

● త్వరలో అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం కమీషన్ బకాయిల విడుదల : మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రేషన్ డీలర్ల డిమాండ్లను 90 శాతం నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. విజయవాడలోని పౌరసరఫరాలశాఖ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రేషన్ డీలర్ల కమీషన్ పెంపు విషయం సిఎం దృష్టికి తీసుకెళ్లి పెంపునకు కృషి చేస్తామన్నారు. డీలర్లు స్టాక్ తీసుకునే సమయంలో కచ్చితంగా తూకం వేసి అందిస్తామని, 2012 నుంచి అంటే గత ప్రభుత్వం నుంచి పేరుకుపోయిన అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం కమీషన్ బకాయిలను త్వరలో విడుదల చేస్తామన్నారు. ప్రతి గ్రామంలో రేషన్‌షాపు, గోడౌన్ ఒకచోటే ఉండేటట్లు ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో సొంత భవనాలు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన డీలర్ల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడంతోపాటు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కరోనా విపత్తులో మరణించిన డీలర్ల కుటుంబాలకు రూ.లక్ష ఆర్థికసాయం చేసేందుకు సిఎంతో చర్చించి న్యాయం చేస్తామన్నారు. ఆయనతోపాటు పౌరసరఫరాలశాఖ కమిషనరు హెచ్ అరుణ్‌కుమార్, సివిల్ సప్లై కార్పొరేషన్ ఎమ్‌డి జి అరుణ్‌పాండ్యన్ పాల్గొన్నారు.

వాన్‌పిక్ భూములు రైతులకివ్వండి

మొదటి పేజీ తరువాయి

ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. భూమలను వెనక్కివ్వడంతో పాటు, రైతులకిచ్చిన హామీలు అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన నిజాయితీని నిరూపించుకోవాలన్నారు.

ఇంటి పక్క గ్రామానికీ హెలికాప్టర్‌లోనా?

తన ఇంటికి కేవలం తొమ్మిది కిలోమీటర్ల దూరానికి కూడా సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెలికాప్టర్‌లో వెళ్లడం హాస్యాస్పదంగా ఉందని వి శ్రీనివాసరావు అన్నారు. ప్రజల్లో తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నికైన జగన్ ఇప్పుడు ప్రజల్లోకి రావడానికి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ప్రజల నిరసన ఎదుర్కొనే ధైర్యంలేక దొడ్డిదార్లు వెతుక్కుని వెళ్లడం ఏమిటన్నారు. సిఎం పర్యటన అంటే పరదాలు కట్టుకుని వెళ్లాల్సిన పని ఏమిటని, ఎన్నో ఏళ్లుగా పెంచుకున్న చెట్లను నరకడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల్లోకి వెళ్లేందుకు ఇన్ని తిప్పలు పడుతున్న ముఖ్యమంత్రి రానున్న ఎన్నికల్లో ఏ విధంగా ప్రజలను ఓట్లడుగుతారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య, పార్టీ నాయకులు నలతోటి బాబూరావు, పి.కొండయ్య, జి.ప్రతాప్ పాల్గొన్నారు.

దళిత మహిళపై అత్యాచారం

● లారీడ్రైవర్ దాష్టీకం

ప్రజాశక్తి - బేస్తవారిపేట (ప్రకాశం)

పిల్లలను, భర్తను చంపుతానని బెదిరించి దళిత మహిళపై ఓ లారీ డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇటీవల ఆమె ప్రతిఘటించడంతో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం, అక్కపల్లికి చెందిన దళిత మహిళ స్థానికుల ఇళ్లలో పాచి పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. ఆమెకు భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్త స్థానికంగా ఉన్న ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తుంటారు. అదే గ్రామంలో బిసి సామాజిక తరగతికి చెందిన కోరాకుల గంగరాజు అనే లారీడ్రైవర్ మహిళను బెదిరించి చాలాకాలంగా అత్యాచారానికి పాల్పడుతున్నాడు. అతని హింసను తట్టుకోలేని ఆమె భర్త, బిడ్డలతో కలిసి మరో కాలనీకి మారిపోయారు. అయినా గంగరాజు వదలలేదు. హింసను ప్రతిఘటించినందుకు కర్రతో ఆమె తలపై దాడి చేశాడు. అడ్డువచ్చిన ఆమె బావ చెయ్యి విరగొట్టాడు. దీనిపై బాధితురాలు బేస్తవారిపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేయలేదు. దీంతో బాధితురాలు దళిత హక్కుల సంఘం నాయకులను ఆశ్రయించారు. వారు ఎస్‌పికి ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు నిందితుడు గంగరాజుపై అత్యాచారం, హత్యాయత్నం కేసును పోలీసులు నమోదు చేశారు. కంభం ప్రభుత్వస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని ఫోన్‌లో ఎస్‌పి పరామర్శించారు.

కవిత పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో : బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ వాయిదా వేసింది. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఇడి జారీ చేసిన సమన్లు రద్దు చేయాలని, దర్యాప్తు సంస్థలు మహిళలను వారి ఇంట్లోనే విచారించాలంటూ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాంశు ధులియాతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. కేంద్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి చిదంబరం భార్య నళిని చిదంబరం, పశ్చిమబెంగాల్ సిఎం మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్‌బెనర్జీ పిటిషన్‌లతో కలిపి కవిత పిటిషన్ ధర్మాసనం ముందుకొచ్చింది. ఇతర కేసుల విచారణ వల్ల సమయం లేకపోవడంతో శుక్రవారం కవిత పిటిషన్ విచారిస్తామని ధర్మాసనం పేర్కొంది.

ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ నిలిపివేతపై ఇంటర్ విద్యార్థుల నిరశన



విజయవాడ ధర్నా చౌక్‌లో ఎస్ఎఫ్ఐ చేపట్టిన నిరసన దీక్షలను ప్రారంభిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-యంత్రాంగం

విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలని, జూనియర్ కళాశాలల్లో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులు సోమవారం ఎనిమిది గంటల నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

విజయవాడ ధర్నా చౌక్‌లో ఎస్ఎఫ్ఐ నిరసన దీక్షలను పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రారంభించి మాట్లాడారు. కళాశాలలు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ప్రభుత్వం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షకు ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు సిహెచ్ బాబూ రావు, సిఐటియు రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎంఎ గఫూర్, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాలాద్రి తదితరులు మద్దతు తెలిపారు. శ్రీకాకుళం డేఅండ్‌నైట్ కూడలి వద్ద విద్యార్థులు నిరసన దీక్ష చేపట్టారు. రాష్ట్ర కార్యదర్శి ఎ అశోక్ మాట్లాడారు. కృష్ణాజిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్‌లో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్ సమరం, రాష్ట్ర మాజీ సహాయ కార్యదర్శి పి పవన్ తదితరులు పాల్గొన్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. హిందూపురం బిసిఎల్ షోరూం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద దీక్ష చేపట్టారు. కర్నూలు జిల్లా ఆలూరులో, కడప కలెక్టరేట్ ఎదుట, అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఒంగోలు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. తొలుత అంబేద్కర్ భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. విజయనగరం జిల్లా ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు ఎనిమిది గంటల నిరసన దీక్ష చేపట్టారు. గుమ్మలక్ష్మీ పురం తహశీల్దార్ కార్యాలయం వద్ద, పార్వతీపురం జిల్లాలో నిరసన దీక్షలు చేపట్టారు.

కళ్లకలక కలకలం

- తూర్పు, సిక్కోలులో విజృంభణ • బాధితుల్లో అధికంగా చిన్నారులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం, శ్రీకాకుళం ప్రతినిధి

తూర్పు గోదావరి, శ్రీకాకుళం జిల్లాలో కండ్ల కలక విజృంభిస్తోంది. ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే లక్షణం ఉండడంతో గంటల వ్యవధిలో బాధితుల సంఖ్య పెరుగుతోంది. హాస్టల్స్, స్కూల్స్‌లో కండ్ల కలక బారిన పడిన చిన్నారుల సంఖ్య పెరుగుతోంది. వాతావరణంలో మార్పులు, కెమికల్ రియాక్షన్, రసాయనాలు, వాహనాల పొగ, సౌందర్య ఉత్పత్తులు వాడకం, దుమ్ము, ధూళి, పెంపుడు జంతువులు, పుప్పొడి వల్ల కళ్ల కలక వస్తుందని వైద్యులు చెబుతున్నారు.

చిన్నారులే అత్యధికం

జిల్లాలో అనేక పాఠశాలల్లోని చిన్నారులు ఈ వ్యాధి బారినపడ్డారు. ఈ నెల 21న రాజమహేంద్రవరం ఇన్నీసుపేటలోని బాలుర హాస్టల్‌లో 45 మంది కళ్లకలకకు గురయ్యారు. రాజమహేంద్రవరంలోని కేంద్రీయ విద్యాలయంలో 12 మంది విద్యార్థులు వైరస్‌కు గురవ్వడంతో యాజమాన్యం బాధిత విద్యార్థులను దూరంగా ఉంచి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చింది. ఆర్యాపురంలోని ఓ ప్రముఖ ప్రయివేటు పాఠశాలల విద్యార్థుల్లో 10 మందిలో వైరస్‌ను గుర్తించి ఇంటికి పంపేశారు. కండ్లకలక బాధితులకు వైద్యం అందించిన సీతంపేటకు చెందిన ఇద్దరు ఆర్‌ఎంపిలు



సైతం వైరస్ బారిన పడ్డారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ కళ్ల కలకల బాధితులతో ఒపి ఒక్కసారిగా పెరిగింది. రోజుకు 80 నుంచి 110 ఒపిలు నమోదవుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా అందరూ వ్యాధి బారిన పడుతున్నారు. పాఠశాలల్లో ఒకరి నుంచి మరొకరికి వ్యాధి సోకుతుంది. అలా వారి తల్లిదండ్రులకూ వ్యాపిస్తుంది. ఈ వ్యాధితో ప్రభుత్వ ఉద్యోగులు సెలవులు పెడుతుండటంతో విధులపై ప్రభావం చూపుతోంది. శ్రీకాకుళంలోని మంచు ఐ కేర్ ఆస్పత్రికి ప్రతి రోజు సుమారు 40 మంది రోగులు వస్తే అందులో 20 మంది కళ్ల కలకతో వస్తున్నారని ఆస్పత్రి ఎండి, గ్లకోమా సర్జన్ డా. మంచు వాసుదేవరావు చెప్పారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

కళ్ల కలక బాధితులు కంటి వైద్యుల సలహాలు పాటించటంతో పాటు రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలి. ఫలితంగా ఎక్కువ మందికి వ్యాప్తి చెందకుండా కట్టడి చేయవచ్చు. కంటిని శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు చల్లని నీటితో బాగా కడగాలి. చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి. కంటి వైద్యులు పరిశీలించిన తర్వాత సమస్యను బట్టి మందులు వాడాలి. మొబైళ్లు, టివిలకు దూరంగా ఉండాలి. బాధితులు వినియోగించిన దుస్తులు, దప్పట్లు, ఇతర సామగ్రిని ఇతరులు వాడరాదు.

సెల్ఫ్ ఐసోలేషన్ కేర్ తీసుకోవాలి

చిన్నారులకు వైద్యం అందించాం. వాతావరణంలో మార్పులు కారణంగా కళ్ల కలకలు వస్తాయి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రెండు గంటలకు ఒకసారి కళ్లు శుభ్రం చేసుకోవాలి. వైద్యుల సలహాలు పాటించి ఐసోలేషన్‌లో ఉండటం మంచింది. బాధితులు కళ్ల అద్దాలను వినియోగించాలి. చేతులు ఎప్పటికపుడు శుభ్రం చేసుకోవాలి. ప్రతి పిహెచ్‌సిలో కళ్లకలకల నివారణకు మందులు అందుబాటులో ఉంచాం.

- డాక్టర్ ఎ. లావణ్య జిల్లా అంధత్వ నివారణ అధికారి

అంటరానితనంపై అంకుశం మోపిన జాషువా

- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమాజాన్ని మేల్కొలిపే గొప్ప రచనలతో అవమానాలు పొందినచోటే సత్కారాలు అందుకున్న గొప్ప కవి గుర్రం జాషువా అని శాసనమండలి సభ్యులు, వైసిపి కేంద్ర కార్యాలయ సమన్వయకర్త లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమం సోమవారం జరిగింది. గుర్రం జాషువా విగ్రహానికి లేళ్ల అప్పిరెడ్డితోపాటు ఎమ్మెల్యే మద్దాలి గిరి, పలువురు వైసిపి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు.

ఈ సందర్భంగా లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ.. నిమ్నకులంలో జన్మించి అనేక అవమానాలు ఎదుర్కొన్నప్పటికీ సమాజంలోని కుళ్లును, అంటరానితనాన్ని తన రచనల ద్వారా గుర్రం జాషువా ఎండగట్టారని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ రాష్ట్ర ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు, నవరత్నాల ప్రోగ్రామ్ వైస్ ఛైర్మన్ నారాయణమూర్తి, గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన పోలవరం పనులు

- ఎగువ, దిగువ కాఫర్ డ్యాము మధ్య సీపేజీ జలాలు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు ఎగువ, దిగువ కాఫర్ డ్యాముల నడుమ జరుగుతున్న ఇసుక డంపింగ్, డయా ఫ్రంవాల్ ప్రాంతంలో అగాధాల పూడ్చివేత, వైబ్రో కాంపాక్షన్ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఎగువ, దిగువ కాఫర్ డ్యాముల నడుమ సీపేజీ జలాల నీటిమట్టం పెరగడంతో పనులను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. వరద ప్రభావం వల్ల ప్రధాన డ్యామ్ నిర్మాణ పనులు ఆగినా... వరద ప్రభావం లేని ప్రాంతాల్లో పనులు సజావుగానే కొనసాగుతాయని పోలవరం ప్రాజెక్టు ఎస్ఇ నరసింహమూర్తి తెలిపారు. పోలవరం నుండి 9,36,296 లక్షల క్యూసెక్కుల వరద జలాలను దిగువకు విడుదల చేసినట్లు ఇఇ పి.వెంకటరమణ పేర్కొన్నారు.



అనంతపురంలో మౌన ప్రదర్శన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు

దోషులను శిక్షించండి

- మణిపూర్‌లో హింసను నిరసిస్తూ ఆందోళనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

మణిపూర్‌లో హింసకు కారకులైన వారిని తక్షణమే అరెస్టు చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, ప్రజా, దళిత సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఆందోళనలు నిర్వహించారు. ఆదివాసీ మహిళలకు రక్షణ కల్పించి, తక్షణమే శాంతి నెలకొనేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖలో మహిళ కాలేజీ నుంచి ఎల్ఐసి బిల్డింగ్ మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్టుల నెట్వర్క్ (ఐడిఐఎన్) ఆధ్వర్యాన విశాఖ కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపారు. అనంతరం స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనకాపల్లి జిల్లా చోడవరం పట్టణ పరిధి ద్వారకానగర్‌లో ఆందోళన చేశారు. నర్సీపట్నం మండలం వేములపూడి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు నిరసన తెలిపారు. అల్లూరి జిల్లా కూనవరం, అనంతగిరి, పార్వతీపురం, సీతంపేటలో ఆందోళన చేపట్టారు. శ్రీకాకుళంలో ఇశ్రా ఫౌండేషన్ ఆధ్వర్యాన ఏడు రోడ్ల కూడలి వద్ద శాంతి ర్యాలీ నిర్వహించారు. పలాసలో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతపురంలో అనంత పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ సర్కిల్ నుంచి సప్తగిరి సర్కిల్ వరకు మౌన ప్రదర్శన చేపట్టారు. పెద్ద ఎత్తున విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు. అన్నమయ్య జిల్లాలోని పుల్లంపేట, గాలివీడులో అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. గుంటూరు జిల్లా పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో నిర్వహించిన నిరసనలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె ఉమశ్రీ పాల్గొన్నారు. మణిపూర్ మహిళలపై అమానవీయ దాడులు జరుగుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదని మండిపడ్డారు. సత్తెనపల్లి తాలూకా కోర్టులో న్యాయవాదులు నిరసన తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణంలోని నరేంద్ర సెంటర్ వద్ద మహిళలు, ఏలూరు, చింతలపూడిలో నిరసన కార్యక్రమం చేపట్టారు.

పవన్ కల్యాణ్‌పై క్రిమినల్ కేసు

- మహిళా వలంటీర్ ఫిర్యాదును స్వీకరించిన విజయవాడ కోర్టు

ప్రజాశక్తి- విజయవాడ

తమ పరువుకు భంగం కలిగే విధంగా తమపై ఆరోపణలు చేసిన జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన ఓ వార్డు వలంటీరు సోమవారం విజయవాడ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్, మున్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆశ్రయించారు. తమపై అవాస్తవమైన ఆరోపణలు చేస్తూ రాష్ట్రంలోని వలంటీర్ల పరువుకు భంగం కలిగించే రీతిలో మాట్లాడుతున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా తాము నిరసనలు వ్యక్తం చేసినా క్షమాపణలు చెప్పకుండా, లేనిపోని అవాస్తవలను వల్లె వేస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసును విచారణకు స్వీకరించిన కోర్టు... పవన్ కల్యాణ్‌పై 499, 500, 504, 505 సెక్షన్ల కింద కేసు నమోదు చేసింది. వలంటీరు తరుపున న్యాయవాదులు గవాస్కర్, ఎం.విఠల్ కోర్టులో కేసు వేశారు.



ఎర్ర జెండాలు పాతి అక్కడే కూర్చొన్న పేదలు

పెనుకొండలో భూస్వాధీన పోరాటం

- ఎర్రజెండాలు పాతిన పేదలు

ప్రజాశక్తి - పెనుకొండ

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణ సమీపంలో పేదలు భూ స్వాధీన పోరాటం నిర్వహించారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పట్టణ సమీపంలోని మెడికల్ కళాశాల ఎదురుగా ఉన్న సర్వే నెంబర్ 668లో ఎర్రజెండాలు పాతారు. అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకూర్చున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, సిపిఎం మండల కార్యదర్శి రమేష్ మాట్లాడారు. పెనుకొండ ప్రాంతంలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు మంజూరు చేయాలని తహశీల్దార్, కమిషనర్, సబ్ కలెక్టర్, సచివాలయాల్లో అనేకమార్లు అర్జీలు ఇచ్చామన్నారు. దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో పట్టాలు ఇస్తామని గొప్పలు చెప్పే అధికారులు నెలలు గడుస్తున్నా పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం లేదని విమర్శించారు. అధికారులు స్పందించకపోవడంతో పేదలతో కలిసి భూ స్వాధీనం పోరాటం చేపట్టామని తెలిపారు. అధికారులు స్పందించి పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తహశీల్దార్ స్వర్ణలత, కమిషనర్ వంశీకృష్ణ భార్గవ, ఎస్ఐ రమేష్ బాబు ఆందోళనా స్థలికి చేరుకుని సిపిఎం నాయకులతో మాట్లాడారు. ఇళ్ల పట్టాలకు సంబంధించిన జాబితా ప్రస్తుతం జాయింట్ కలెక్టర్ వద్ద ఉందని, అనుమతి రాగానే భూసర్వే చేయించి పేదలకు పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భూ సర్వే చేసేంత వరకు ఆందోళన కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అన్నమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, వెంకటేష్, వెంకటరాముడు, తిప్పన్న, కొండా వెంకటేష్, రంగప్ప, పేదలు పాల్గొన్నారు.

అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ వద్ద అఖిలపక్షాల నిరసన

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖపట్నం

అదాని గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఆవరణలో అఖిలపక్ష రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యాన నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు స్పందనలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అదానీ గంగవరం పోర్టు కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 4వ తేదీ నుండి కార్మికులు పోరాటం చేస్తున్నా ప్రభుత్వం, యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నాయన్నారు. గంగవరం పోర్టులో పనిచేస్తున్న కార్మికులంతా మత్స్యకార కుటుంబాలకు చెందినవారని, వీరి అసంతృప్తి తీవ్ర ఆగ్రహంగా మారి పారిశ్రామిక అశాంతికి దారితీయకముందే ప్రభుత్వం జోక్యం చేసుకొని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు బేసిక్ రూ.22 వేలతో పాటు కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలని, అన్యాయంగా తొలగించిన 29 మంది యూనియన్ నాయకులను, కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. చనిపోయిన కార్మిక కుటుంబాలకు తగు నష్టపరిహారం ఇవ్వాలని, కార్మిక చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ పరిధిని రద్దుచేసి ఫ్యాక్టరీ యాక్ట్ పరిధిలోకి తేవాలని, కార్మికులపై నిర్బంధం ఆపాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కార్మికులు, కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపించేలా జిల్లా కలెక్టర్ తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎండి నజీర్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వై కొండయ్య, ఆమ్ ఆద్మీ జిల్లా కన్వీనర్ ఇ చంద్రశేఖర్, సిపిఐ (ఎంఎల్) ప్రజాపోరు నాయకులు దాసు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ సుధాకర్, సిఐటియు జిల్లా కార్యదర్శి బి జగన్, హెచ్‌ఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దొమ్మేటి అప్పారావు, ఐఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి కె ఈశ్వరరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి కృష్ణారావు, గంగవరం పోర్టు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఎపి మహిళా కాంగ్రెస్ అధ్యక్షులుగా లామ్ తాంతియా కుమారి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షులుగా లామ్ తాంతియా కుమారిని కాంగ్రెస్ పార్టీ నియమించింది. ఈ మేరకు సోమవారం ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్‌ఖర్గే నియమించినట్లు ఎఐసిసి కార్యదర్శి కెసి వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు. ఎపితోపాటు బీహార్, జమ్ముకాశ్మీర్, త్రిపుర, రాజస్థాన్ రాష్ట్రాలకు మహిళా కాంగ్రెస్ అధ్యక్షులను కాంగ్రెస్ పార్టీ నియమించింది. గతంలో కృష్ణా జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్‌గా లామ్ తాంతియా కుమారి వ్యవహరించారు.

పూర్ణానంద స్వామికి పాక్సో కోర్టులో చుక్కెదురు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

తల్లిదండ్రులను కోల్పోయి ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న బాలికలపై అత్యాచారం ఆరోపణల కేసులో అరెస్టయిన వెంకోజీపాలెంలోని జ్ఞానానంద ఆశ్రమం నిర్వాహకుడు పూర్ణానంద సరస్వతీ స్వామి (పున్నయ్య స్వామి)కి సోమవారం విశాఖ పోక్సో కోర్టులో చుక్కెదురైంది. ఇద్దరు బాలికలపై లైంగిక దాడి జరిగినట్టు ఫోరెన్సిక్ నివేదికలో రుజువు కావడం, పూర్ణానంద స్వామికి వ్యతిరేకంగా ఆధారాలు ఉండడంతో బెయిల్ మంజూరు చేయడం ప్రమాదమని పోక్సో స్పెషల్ పిపి కరణం కృష్ణ వాదనలు వినిపించారు. దీంతో ఏకీభవించిన కోర్టు పూర్ణానంద బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

2050కి 25 ఎంఎంటి హైడ్రోజన్ ఎనర్జీ

- విశాఖలో గ్లోబల్ ఎనర్జీ ఎన్విరాన్‌మెంట్ సమ్మిట్ ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ, విశాఖ

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపిఇ) ఆధ్వర్యాన హైడ్రోజన్‌పై గ్లోబల్ ఎనర్జీ ఎన్విరాన్‌మెంట్ సమ్మిట్ సోమవారం ప్రారంభమైంది. నగరంలోని నోవోటెల్ హోటల్‌లో జరిగిన సమ్మిట్‌కు భారత ప్రభుత్వ పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ కార్యదర్శి పంకజ్ జైన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు హైడ్రోజన్‌ను విమానయాన ఇంధనంగా ఉపయోగించేవారని తెలిపారు. 2050 నాటికి 25 ఎంఎంటి హైడ్రోజన్ ఎనర్జీని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందులో 75 శాతం ఎలక్ట్రోలైజ్ నుంచి, 30 శాతం బొగ్గు, సహజవాయువు నుంచి ఉత్పత్తి అవుతుందని తెలిపారు. ఐఐపిఇ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ మాట్లాడుతూ.. శిలాజ, పునరుద్ధరణ కాని శక్తి డిమాండ్లను తీర్చడమే సంస్థ యొక్క ప్రాథమిక లక్ష్యమని చెప్పారు. గ్లాస్గోలో జరిగిన కాప్ 26 సదస్సులో భారత ప్రధాని అందించిన వాతావరణ సమస్యకు 'పంచామృతం" సమ్మేళనాన్ని సాకారం చేసే దిశగా పరిశోధనలకు ఐఐపిఇ కట్టుబడి ఉందన్నారు. ప్రొఫెసర్ సోమనాథ్ ఘోష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దక్షిణ కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ ప్రొఫెసర్ జి.కె.సూర్యప్రకాష్, ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ ఎమ్‌డి, సిఇఒ డాక్టర్ ఎం.కమలాకర్‌బాబు ప్రత్యేక అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి అమెరికా నుంచి ప్రత్యేకంగా వచ్చిన ప్రతినిధి బృందం హాజరైంది.

ఐదేళ్లలో రూ.10.57 లక్షల కోట్ల అప్పుల రద్దు

- గతేడాది రూ.2 లక్షల కోట్లు • ఆర్‌బిఐ వెల్లడి

న్యూఢిల్లీ : పేద, మధ్యతరగతి వారు వేలల్లో అప్పు తీసుకుని చెల్లించకుంటేనే నానా ఆందోళన చేసే బ్యాంకులు.. బడా బాబులకు చెందిన లక్షల కోట్ల రుణాలను మాత్రం చూసి చూడనట్లుగా రద్దు చేస్తున్నాయి. గడిచిన ఐదేళ్లలో ఏకంగా రూ.10.57 లక్షల కోట్ల అప్పులను రద్దు చేశాయని ఆర్‌బిఐ గణంకాలు చెబుతున్నాయి. సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) కింద ఇచ్చిన నివేదిక ప్రకారం ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఓ కథనం ప్రచురించింది. క్రితం ఆర్థిక సంవత్సరంలో 2022-23లో రూ.2.09 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశాయి. మొండి బాకీల కింద చేర్చిన ఈ మొత్తాల పద్దులను తొలగించాయి. దీంతో స్థూల నిరర్థక ఆస్తులను 2023 మార్చి ముగింపు నాటికి 3.9 శాతానికి తగ్గినట్లు ఆర్‌బిఐ, ప్రభుత్వాలు చూపిస్తున్నాయి. 2018 మార్చి ముగింపు నాటికి స్థూల నిరర్థక ఆస్తులు రూ.10.21 లక్షల కోట్లుగా ఉండగా.. 2023 మార్చి ముగింపు నాటికి రూ.5.55 లక్షల కోట్లకు తగ్గాయి. ఇందుకు ప్రధాన కారణం ఆ పద్దులను రానీ బాకీల కింద తొలగించడమే. ఆర్‌బిఐ డాటా ప్రకారం.. 2022-13 నుంచి రూ.15,31,453 కోట్ల మొండి బాకీలను రద్దు చేశారు. గడిచిన మూడేళ్లలో రూ.5,86,891 కోట్ల మొండి బాకీల్లోంచి కేవలం రూ.1,09,186 కోట్లు మాత్రమే వసూళ్లు అయ్యాయి. కేవలం 18.60 శాతం మాత్రమే రికవరీ చేయగలిగాయి. 2022-23లో రూ.2,09,144 కోట్లు, ఇంతక్రితం 2021-22లో రూ.1,74,966 కోట్లు, 2021 మార్చితో ముగిసిన ఏడాదిలో రూ.2,02,781 కోట్ల చొప్పున మొండి బాకీలను రద్దు చేశారు.

ట్విట్టర్‌లో పక్షీ పోయి.. ఎక్స్ వచ్చే..



శాన్‌ఫ్రాన్సిస్కో : మైక్రోబ్లాగింగ్ సైట్ ట్విట్టర్ లోగో మారింది. ఇప్పటి వరకు ఉన్న పక్షిని తొలగించి.. ఆ చోట ఎక్స్ లోగోను ప్రవేశపెట్టారు. అదే విధంగా ట్విటర్ వెబ్‌సైట్‌ను కూడా ఎక్స్.కామ్‌తో అనుసంధానం చేశారు. ట్విట్టర్‌ను స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి ఎలన్ మస్క్ భారీ మార్పులపై దృష్టి సారించారు. ఇందులో భాగంగానే సోమవారం తెల్లవారుజామున శాన్‌ఫ్రాన్సిస్కోలోని ట్విటర్ ప్రధాన కార్యాలయంలో బ్లాక్ బ్యాక్ గ్రౌండ్‌లో వైట్ కలర్ 'ఎక్స్' తో కొత్త లోగోను మస్క్ ఆవిష్కరించారు. ట్విటర్ విస్తృత రీబ్రాండింగ్ ప్రయత్నంలో ఈ మార్పు అని మస్క్ తెలిపారు. ఇక ట్విట్టర్ పేరు కూడా ఎక్స్‌గా మార్చేశారు. ఇకపై ట్విట్టర్ డాట్ కామ్ బదులు ఎక్స్.కామ్ లైవ్‌లోకి వస్తుందని మస్క్ వెల్లడించారు. ఎక్స్ అనేది భవిష్యత్‌లో యూజర్లకు ఆడియో, వీడియో, మెసేజింగ్, చెల్లింపులు, బ్యాంకింగ్ వంటి అపరిమిత సేవలు అందిస్తుందని ట్విట్టర్ సిఇఒ లిండా యాకారినో తెలిపారు. కృత్రిమ మేధ ఆధారితమైన ఎక్స్ ఊహించని రీతిలో అందరినీ కలుపుతుందన్నారు.

కేడర్ స్ట్రెంగ్త్ ఉత్తర్వులు సవరించాలి

- ఉద్యోగుల కుదింపుతో పనిభారం
- ఆర్‌టిసి ఎమ్‌డితో ఉద్యోగ సంఘాల చర్చలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసిలో కేడర్ స్ట్రెంగ్త్ పేరుతో ఉద్యోగులను కుదించడంతో పనిభారం పెరిగిందని, దీంతో ఇబ్బందులు పడుతున్నారని ఆర్‌టిసిలోని ఉద్యోగ సంఘాలు పేర్కొన్నాయి. కేడర్ స్ట్రెంగ్త్ ఉత్తర్వులను సవరించాలని డిమాండ్ చేశాయి. ఆర్‌టిసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, కేడర్ స్ట్రెంగ్త్ ఉత్తర్వులపై చర్చించేందుకు ఉద్యోగ సంఘాల నేతలతో ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు విజయవాడలోని ఆర్‌టిసి హౌస్‌లో సమావేశమయ్యారు. ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు కెఎస్ బ్రహ్మానందరెడ్డి పాల్గొన్న ఈ సమావేశంలో ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కట్టా సుబ్రమణ్యం, ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి ఐవి నర్సయ్య, ఎపిపిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు. కేడర్ స్ట్రెంగ్త్ ఉత్తర్వులతో ఉద్యోగుల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని ఎమ్‌డి దృష్టికి ఉద్యోగ సంఘాల నేతలు తీసుకొచ్చారు. సిబ్బంది కుదింపుతో ఉద్యోగులపై తీవ్ర పనిభారం పెరిగిందన్నారు. ముందుగా ఎలాంటి అధ్యయనం చేయకుండా నిబంధనలను రూపొందించడంతో సమస్యలకు పరిష్కారం దొరకడం లేదని అన్నారు. బదిలీలతో హెచ్‌ఆర్‌ఎ, ఇతర అలవెన్స్‌లు కూడా తగ్గి ఉద్యోగులకు ఆర్థికంగా నష్టం చేస్తోందని వివరించారు. వైద్యసేవలు, ఇంక్రిమెంట్లు, ఎరియర్స్, సిసిఎస్ రుణాలు, డ్యూటీ ఛార్జీలు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. రిటైర్మెంట్ల వల్ల ఏర్పడే ఖాళీలను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ.. తమ పరిధిలోని సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కేడర్ స్ట్రెంగ్త్ సమస్యలపై అధ్యయనం చేశాక మరోసారి ఉద్యోగ సంఘాలతో సమావేశమై సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

చట్టుబండలు !

ప్రభుత్వం నెత్తికెత్తుకున్న విద్యారంగ 'సంస్కరణ'లు సర్కారీ బడి చదువులను చట్టుబండలు చేశాయి. మార్కెట్ సరుకుగా మారిన ప్రైవేటు, కార్పొరేట్ విద్యను కొనుక్కోలేని బడుగు, బలహీన, పేద పిల్లలకు ప్రభుత్వ బడులే దిక్కు. కాగా ఆ అవకాశాన్నీ దూరం చేస్తోంది ప్రభుత్వం. వ్యాపార, ఏకరూప విద్య లక్ష్యంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని దేశంపై రుద్దగా, అన్ని ఇతర రాష్ట్రాల కంటే ముందు ఇక్కడే అమలవుతోంది. పర్యవసానం బడుల మూత. 3,4,5 తరగతులను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసే సందర్భంలో ఒక్కటంటే ఒక్క స్కూలు మూతబడినా నిలదీసి ప్రశ్నించమంది ప్రభుత్వం. జరిగిందేమిటి? 1,2.. రెండు తరగతులే ఉండటంతో స్కూళ్లకు విద్యార్థులు రావట్లేదు. ప్రత్యామ్నాయం చూసుకున్నారు. ఒక టీచరే ఉండటం పిల్లలు రాకపోవడానికి మరొక కారణం. గతంలో పది మంది పిల్లలున్న స్కూళ్లల్లో ఇప్పుడు ఒక్కరూ లేరు. స్కూళ్లల్లో పిల్లలు లేరు కాబట్టి వాటిని మూసేయాలని ప్రతిపాదనలు రెడీ అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 118 ప్రైమరీ స్కూళ్ల మూతకు సిద్ధమైంది ప్రభుత్వం. ఎయిడెడ్ స్కూళ్లను ప్రభుత్వానికి అప్పగించండి, లేదంటే ఉపాధ్యాయులను సరండర్ చేసి, స్వంతంగా మీరే నడుపుకోమన్నందున వంద ఎయిడెడ్ పాఠశాలు బంద్ పెట్టే దశకు చేరుకున్నాయి. ప్రభుత్వ బడులకు తాళాలు సామాజిక న్యాయానికి ఉరితాళ్లు.

విద్యా వ్యాపారానికి చిరునామా ఇంటర్ విద్య. గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో చదువుతున్నది ఎస్‌టి, ఎస్‌సి, బిసి, మైనార్టీ పిల్లలే. వారికి ఉచిత టెక్ట్స్ బుక్స్ ఇవ్వడానికి ప్రభుత్వానికి చేతులు రావట్లేదు. తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) రెండేళ్లపాటు పుస్తక ప్రసాదం పేరిట ఇచ్చి నిరుడు చేతులెత్తేసింది. సహాయం చేయాలని ఈ ఏట ప్రభుత్వం టిటిడిని అభ్యర్థించినా స్పందన శూన్యం. మార్కెట్‌లో అమ్మకాల కోసం తెలుగు అకాడమీ ముద్రించిన పుస్తకాలను ప్రభుత్వ కాలేజీ విద్యార్థులు కొనుక్కోవాల్సిన పరిస్థితి. కెజిబివి, రెసిడెన్షియల్, వెల్ఫేర్ కళాశాలల్లో పుస్తకాలు ఉచితం అంటున్నా అన్ని పుస్తకాలూ అందుబాటులో లేవు. ఏవో కొన్ని ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. యూనిఫారాలు, కిట్లు, అన్నీ అంతే. నాసిరకం వంటి అక్రమాలు సరేసరి. విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని కొలవడానికి ఇంతకంటే కొలబద్దలేం కావాలి? ఆంగ్ల భాషలో విద్యా బోధన, సిబిఎస్‌ఇ సిలబస్, అంతర్జాతీయ స్థాయి కోర్సులు, జగన్ మామ భరోసా...ఇవన్నీ శుష్క వాగ్దానాలుగా విద్యార్థులు, తల్లిదండ్రులు భావిస్తున్నారు.

విద్యారంగంలో మార్పులపై ప్రభుత్వానిది ఏకపక్ష ధోరణి. నిపుణులతో, ఉపాధ్యాయ సంఘాలతో, అధికారులతో సంప్రదింపులు నాస్తి. 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ సంస్థ ఇచ్చే కంటెంట్‌తో ఉచితంగా ట్యాబ్‌లిచ్చారు. బైజూస్ కంటెంట్ విద్యార్థులకు ఏ మేరకు ఉపయోగపడుతుందో కనీస మాత్రం అభిప్రాయాలు తీసుకోలేదు. వచ్చే ఏడాది బైజూస్ ఉచితంగా కంటెంట్ ఇస్తుందో లేదో ప్రభుత్వం ఎంత చెల్లించాలో తెలీదు. స్కూళ్ల విలీనంపైనా తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్ల చందం. స్వయాన 70 మంది స్వంత పార్టీ ఎంఎల్‌ఎలు వ్యతిరేకించినా లక్ష్యపెట్టలేదు. చివరికి విద్యాహక్కు చట్టానికి సైతం తమకనుకూలంగా సవరణలు చేశారు. అన్నింటికీ 'అమ్మఒడి'నే పరిష్కారంగా చెపుతున్నారు. దానికీ కొన్ని కోతలు పెడుతున్నారు. కోవిడ్, ఆపై స్కూళ్ల మూత వలన నిరుడు 1.73 లక్షల మంది పిల్లలు మధ్యలోనే బడి మానేశారు. ఎ.పి.లో సెకండరీ లెవెల్‌లో డ్రాపవుట్స్ రేటు 16.7 శాతంగా కేంద్రం పేర్కొంది. అదేమీ తక్కువ సంఖ్య కాదు. భావి భారత నిర్మాణానికి అడ్డంకి. రాష్ట్రంలో 50 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పార్లమెంట్ సాక్షిగా వెల్లడైంది. నాలుగేళ్లయినా ఒక్క డిఎస్‌సి వేయలేదు. 'నాడు-నేడు' వంటి కొన్ని కార్యక్రమాలు తప్ప సర్కారీ స్కూళ్లు సాధికారమైంది లేదు. ఈ వాస్తవాలతో ప్రభుత్వ నినాదాలైన 'ప్రైవేటు బళ్లతో పోటీ, పెత్తందారీ తనం బద్దలు' వాగాడంబరమేనని అర్థమవుతుంది. విద్యను మరింత కార్పొరేటీకరించే కేంద్ర నూతన విద్యావిధానాన్ని విడనాడి, ప్రత్యామ్నాయాన్ని అమలు చేస్తేనే విద్య సార్వజనీనత సిద్ధిస్తుంది. విద్యాహక్కు కొంతైనా సాకారమవుతుంది.



సోషలిజం సమాజంలో చాలా మార్పులు తెస్తుంది. ప్రజలందరికీ అవసరమైన ఆహారం, గృహ వసతి అందిస్తుంది. మానవుల మధ్య అసమానతలు, వర్గ విభజన తొలగిస్తుంది. ఆర్థిక వ్యవస్థలో ప్రజాతంత్రయుతమైన ప్రణాళికను ప్రవేశ పెడుతుంది. ప్రపంచ శాంతి, సమైక్యత నెలకొల్పుతుంది. కానీ సోషలిజం ఈ మార్పులన్నీ తేవాలంటే ముందుగా కార్మికవర్గం పెట్టుబడిదారీ వ్యవస్థను తొలుత ఒక దేశంలోనూ, తర్వాత మొత్తం ప్రపంచమంతటానూ కూకటివేళ్లతో పెకిలించి పారేయాల్సి వుంటుంది.

- జాన్ మోలినాక్స్,
బ్రిటిష్ సోషలిస్టు వర్కర్స్ పార్టీ సభ్యుడు, రచయిత.

లాభాల రేటు ఎప్పుడు పడిపోతుంది?

పెట్టుబడిదారీ వ్యవస్థలో లాభాల రేటుకు పడిపోయే స్వభావం ఉందంటూ జోస్యం చెప్పే సిద్ధాంతాలను ముందుకు తెచ్చిన పెద్దపెద్ద ఆర్థికవేత్తలు చాలామంది ఉన్నారు. ఈ విధమైన సిద్ధాంతాలను ప్రతిపాదించిన ఆర్థికవేత్తలకు పెట్టుబడిదారీ విధానం ఎల్లకాలమూ కొనసాగే విధానం కాదన్న వాస్తవం తెలుసు అని మార్క్స్ అన్నాడు. ఈ సిద్ధాంతాలలో కొన్ని తర్కానికి నిలబడతాయి. మరికొన్ని నిలబడవు. ఆ విధంగా నిలబడని సిద్ధాంతాలలో ఆడమ్ స్మిత్ సిద్ధాంతం కూడా ఉంది.


పెట్టుబడి "అతిగా" పోగుబడితే అది లాభాల రేటు పడిపోడానికి దారి తీస్తుందని ఆడమ్ స్మిత్ భావించాడు. అతని వాదన ఈ విధంగా ఉంది: ఏదైనా ఒకానొక పరిశ్రమలో అంతకంతకూ ఎక్కువ పెట్టుబడి పోగుబడి, అంతకంతకే ఎక్కువ సరుకులు ఉత్పత్తి అయితే, అప్పుడు ఉత్పత్తికయ్యే ఖర్చుతో పోల్చి చూసుకున్నప్పుడు ఆ సరుకు ధర పడిపోతుంది. దాంతో ఒక్కో సరుకు మీదా వచ్చే లాభం పడిపోతుంది. ఆ విధంగా ఒక్కో సరుకు మీదా వచ్చే లాభం పడిపోయినప్పుడు మొత్తం పెట్టిన పెట్టుబడి మీద వచ్చే లాభం కూడా పడిపోతుంది. ఇదే వాదన మొత్తం ఆర్థిక వ్యవస్థకు కూడా వర్తిస్తుంది. ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడి అంతకంతకూ ఎక్కువ పోగుబడినప్పుడు లాభాల రేటు పడిపోతుంది.



ప్రభాత్ పట్నాయక్

ఐతే ఈ వాదన తప్పు. ఒకానొక పరిశ్రమకో, రంగానికో వర్తించేది యావత్తు ఆర్థిక వ్యవస్థకు వర్తించదు. ఒకానొక పరిశ్రమలోనో, రంగం లోనో పెట్టుబడి ఎక్కువగా పోగుబడి, మరింత ఎక్కువ మంది కార్మికులను నియమించుకుని దాని ద్వారా అదనపు ఉత్పత్తిని చేశారనుకుందాం. ఆ అదనపు ఉత్పత్తిని వినియోగించేందుకు కావలసిన అదనపు డిమాండ్ కేవలం ఆ రంగం నుండే ఉత్పన్నం కాదు. ఇతర రంగాల నుండి కూడా తోడవాలి. కాని తక్కిన రంగాల్లో ఉత్పత్తి గాని, అదనపు డిమాండ్ కాని ఏమీ మారకుండా అదే రీతిగా కొనసాగుతాయన్న ప్రాతిపదికన ఆడమ్ స్మిత్ సిద్ధాంతం నిర్ధారించింది. కేవలం ఆ రంగంలోనే అదనపు డిమాండ్ వచ్చేటట్లయితే ఆ రంగంలో చేసిన అదనపు ఉత్పత్తి యొక్క విలువ కన్నా ఆ రంగంలో కలిగే అదనపు డిమాండ్ అనివార్యంగా తక్కువగానే ఉంటుంది. అప్పుడు ఆ సరుకు ధరను తగ్గించడం మినహా వేరే మార్గం ఉండదు. అలా తగ్గించినందు వలన లాభం రేటు తగ్గుతుంది. ఇదే ఆడమ్ స్మిత్ చెప్పినది.

కాని, మనం ఒక దేశ ఆర్థిక వ్యవస్థను మొత్తంగా చూస్తే ఈ వాదన నిలబడదు. ఐతే ఇప్పుడిప్పుడు కొందరు అమెరికన్ వామపక్ష ఆర్థికవేత్తలు ఆడమ్ స్మిత్ వాదననే మళ్ళీ ముందుకు తెస్తున్నారు. ఇందులో వాళ్ళు అదనంగా చెప్తున్నది ఇలా ఉంది: పెట్టుబడి పోగుబడిన తర్వాత పెట్టుబడిదారుల నడుమ పోటీ పెరుగుతుంది. దాని ఫలితంగా జరిగే సాంకేతిక పురోగతి వలన శ్రామిక ఉత్పాదకత కూడా పెరుగుతుంది. దానివలన అదనంగా జరిగే ఉత్పత్తి చెల్లుబాటు కావాలంటే ఆ సరుకు ధరను తగ్గించక తప్పదు. అప్పుడు లాభాల రేటు తగ్గుతుంది.



లాభాల రేటు పడిపోయే ధోరణి అంటే అది ధోరణి మాత్రమే. వాస్తవంగా లాభాల రేటు పడిపోయేదాకా పెట్టుబడిదారుడు ఆగడు. ఈ లోపే దానిని అరికట్టే చర్యలు తీసుకుంటాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ లాభాల రేటు పడిపోకుండా ఉండే విధంగా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుంది.

సాంకేతిక పరిజ్ఞానం ఫలితంగా కార్మికుల సంఖ్య తగ్గుతుంది. దానివలన కార్మికులకు చెల్లించే జీతాల వాటా తగ్గుతుంది. కార్మికులకు చెల్లించే వాటాలో తగ్గుదల కన్నా ఆ సరుకు ధర ఎక్కువగా తగ్గినప్పుడే పై వాదన చెల్లుబాటు అవుతుంది. కాని సాంకేతిక పరిజ్ఞానం పెరిగినప్పుడు కార్మికుల జీతాల వాటా తగ్గిన దాని కన్నా సరుకు ధర ఎక్కువ మోతాదులో తగ్గడం అనేది జరగదు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగితే దాని ఫలితంగా కార్మికుల సంఖ్య బాగా తగ్గుతుంది. దాని ఫలితంగా వారికిచ్చే వేతనాల వాటా బాగా పడిపోతుంది. దానితో పోలిస్తే సరుకు ధర తగ్గుదల కారణంగా పెట్టుబడిదారుడి లాభం తగ్గేది ఏమీ ఉండదు.

అందుచేత ఆడమ్ స్మిత్ వాదనను, దాని ప్రాతిపదికన అమెరికన్ వామపక్ష ఆర్థికవేత్తలు చేసే వాదనలను పక్కన పెడదాం. తక్కిన వారిలో రికార్డో చేసిన వాదనను చూద్దాం. అతడు మొక్కజొన్నను ఒక సరుకుగా తీసుకుని తన వాదనను చేశాడు. మొక్కజొన్నను ముడిసరుకుగా ఉపయోగించే ఉత్పత్తిదారులకు లాభాలు పెరిగిన కొద్దీ ఆ పంటను మరింత ఎక్కువగా పండించాల్సిన అవసరం ఏర్పడుతుంది. అదనంగా మొక్కజొన్న పండించాలంటే అందుకు అదనంగా భూమి అవసరం అవుతుంది. కాని మొక్కజొన్న పంటకు అనువుగా ఉండే భూమి పరిమితంగానే ఉంటుంది. అప్పుడు తక్కువ దిగుబడినిచ్చే భూముల్లో సైతం మొక్కజొన్న పంట సాగు చేయడం ప్రారంభిస్తారు. ఆ భూముల్లో మొక్కజొన్న దిగుబడి తక్కువగా ఉంటుంది. దాని ఫలితంగా పెట్టుబడిదారులకు వచ్చే లాభం రేటు కూడా తగ్గుతుంది. ఈ వాదనలో ఒక తర్కం ఉంది.

ఇక ఆ తర్వాత మార్క్స్ చెప్పినది చూద్దాం. పెట్టుబడి పోగుబడుతున్నకొద్దీ స్థిర పెట్టుబడికి, అస్థిర పెట్టుబడికి మధ్య నిష్పత్తి మారిపోతూ వుంటుంది. స్థిర పెట్టుబడి శాతం పెరుగుతూ పోతుంది. మరోవైపు సాంకేతిక పరిజ్ఞానం కూడా మెరుగుపడుతూ వుంటే అప్పుడు శ్రామిక ఉత్పాదకత పెరుగుతుంది. ఆ పరిస్థితుల్లో నికరంగా జరిగే ఉత్పత్తిని అమ్మినప్పుడు వచ్చే రాబడిలో వేతనాలకు, లాభానికి మధ్య నిష్పత్తి గనుక స్థిరంగా ఉంటే అప్పుడు లాభాల రేటు పడిపోతుంది (ఉదా: ఒకానొక సరుకు విలువ రూ.10 అనుకుందాం. అందులో పెట్టుబడి రూ.5 అనుకుందాం. తక్కిన రూ.5లో వేతనాలకి రూ.1, పెట్టుబడిదారుడి లాభంగా రూ.4 ఉంటే వేతనాలకు, లాభానికి మధ్య నిష్పత్తి 1:4 అవుతుంది. ఈ నిష్పత్తి స్థిరంగా కొనసాగడం అంటే పెట్టుబడిదారుడి లాభం పెరిగితే అప్పుడు కార్మికుల వేతనాలు కూడా అదే మోతాదులో పెరగడం అన్నమాట -అను).

అదే పెట్టుబడిదారుడి లాభం పెరిగినా కార్మికుల వేతనాలు పెరగకుండా పాత స్థాయిలోనే కొనసాగితే అప్పుడు లాభాల రేటు పడిపోకుండా పెరుగుతూనే వుంటుంది. ఐతే దీనికీ ఒక పరిమితి ఉంటుంది. స్థిర పెట్టుబడి పెరుగుదల అలాగే కొనసాగుతూ పోతే అప్పుడు కార్మికుల వేతనాలను ఉన్నస్థాయిలో కొనసాగించడం కుదరదు (కొనసాగిస్తే లాభాల రేటు పడిపోతుంది గనుక) వాటిని కుదించక తప్పదు, కాని కార్మికుల వేతనాలను ఒక స్థాయికన్నా తక్కువకు కుదించడం సాధ్యం కాదు. అటువంటప్పుడు లాభాల రేటు పడిపోవడం మొదలౌతుంది.

ఐతే ఉత్పత్తిలో రెండు భాగాలు ఉంటాయి. ఒకటి వినిమయ సరుకులు. రెండవది ఉత్పత్తిలో ఉపయోగించే ముడి పదార్థాలు, యంత్రాలు. ఈ ముడి పదార్థాల, యంత్రాల ఉత్పత్తిలో కన్నా వినిమయ సరుకుల ఉత్పత్తిలో సాంకేతిక పరిజ్ఞానం, శ్రామిక ఉత్పాదకత ఎక్కువగా పెరిగినప్పుడే స్థిర పెట్టుబడి నిష్పత్తి పెరుగుతుంది. ఇలా కొన్ని సందర్భాలలో జరగవచ్చు. ఐతే వాస్తవ ఆచరణలో ఇలాగే అనివార్యంగా జరిగితీరాలని లేదు. మార్క్స్ చెప్పినది తార్కికంగా సరైనది. ఆడమ్ స్మిత్ చెప్పిన మాదిరిగా కాదు.

తార్కికంగా సరైన మూడో వాదనను పరిశీలిద్దాం. ఒకానొక దేశంలో స్థూల డిమాండ్ పెరుగుదల లేకుండా నిలిచిపోయిందనుకుందాం. అప్పుడు ఉత్పత్తి అయిన సరుకులు అమ్ముడు పోకుండా కొంత నిల్వ ఉండిపోతాయి. అప్పుడు పూర్తి స్థాపక సామర్థ్యం మేరకు ఉత్పత్తి చేయకుండా కొంత ఆపుతారు. దాని ఫలితంగా లాభాల రేటు పడిపోతుంది. లాభాల రేటును పడిపోకుండా కొనసాగించాలంటే అప్పుడు కార్మికుల వేతనాల వాటాను తగ్గించాలి. దాని వలన స్థూల డిమాండ్ మరింత పడిపోతుంది. అంటే లాభాల రేటు పడిపోకుండా నిలబెట్టడం కోసం తీసుకున్న చర్య (కార్మికుల వేతనాల వాటాను తగ్గించడం) ఆ లాభాల రేటును నిలబెట్టకపోగా పడిపోయే ప్రక్రియను మరింత వేగవంతం చేస్తుంది.

లాభాల రేటు పడిపోయే ధోరణి అంటే అది ధోరణి మాత్రమే. వాస్తవంగా లాభాలరేటు పడిపోయేదాకా పెట్టుబడిదారుడు ఆగడు. ఈ లోపే దానిని అరికట్టే చర్యలు తీసుకుంటాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ లాభాల రేటు పడిపోకుండా ఉండే విధంగా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుంది. కాబట్టి లాభాల రేటు పడిపోవడం మీద చర్చ అంటే జోస్యం చెప్పడం కాదు. పెట్టుబడిదారీ వ్యవస్థ తన లాభాల రేటును నిలబెట్టుకోవడం కోసం ఏ విధంగా వ్యవహరిస్తుందో విశ్లేషించడానికి తోడ్పడే సాధనం అని గ్రహించాలి.

స్థిర పెట్టుబడి నిష్పత్తి పెరిగిపోతూ వుంటే అది లాభాల రేటు పడిపోడానికి దారి తీస్తుంది. కనుక ఆ నిష్పత్తి పెరిగిపోకుండా ఉండేందుకు చేసే ప్రయత్నం వలస దేశాల నుండి ముడి సరుకులను కారు చౌకగా గాని, ఉత్తి పుణ్యానికి గాని కొల్లగొట్టేందుకు సామ్రాజ్యవాద దేశాలను పురికొల్పింది. అదే మాదిరిగా ఉత్పత్తి దేశీయ మార్కెట్ లోని డిమాండ్‌ను మించిపోయి జరిగితే, ఆ అదనపు ఉత్పత్తిని అమ్ముకోడానికి వలస దేశాల మార్కెట్లను వాడుకున్నారు.

నిజానికి లాభాల రేటు పడిపోకుండా నిలబెట్టుకునే క్రమంలోనుంచే సామ్రాజ్యవాదం ముందుకొచ్చింది. స్థిర పెట్టుబడి నిష్పత్తి పెరిగిపోతూ వుంటే అది లాభాల రేటు పడిపోడానికి దారి తీస్తుంది. కనుక ఆ నిష్పత్తి పెరిగిపోకుండా ఉండేందుకు చేసే ప్రయత్నం వలస దేశాల నుండి ముడి సరుకులను కారు చౌకగా గాని, ఉత్తి పుణ్యానికి గాని కొల్లగొట్టేందుకు సామ్రాజ్యవాద దేశాలను పురికొల్పింది. అదే మాదిరిగా ఉత్పత్తి దేశీయ మార్కెట్ లోని డిమాండ్‌ను మించిపోయి జరిగితే, ఆ అదనపు ఉత్పత్తిని అమ్ముకోడానికి వలస దేశాల మార్కెట్లను వాడుకున్నారు. ఇక్కడ రికార్డో ఉదహరించిన మొక్కజొన్న ఉదంతం గుర్తు చేసుకుందాం. నిజంగానే మొక్కజొన్న పండించే భూభాగం పరిమితంగా ఉంటే అప్పుడు తమ లాభాల రేటు పడిపోకుండా ఉండడానికి సామ్రాజ్యవాదులు వలస దేశాల్లో ఆ మొక్కజొన్న వినియోగాన్ని ఏదో విధంగా తగ్గించి తమ దేశాల వైపు మళ్ళించుకుంటారే తప్ప లాభాల రేటును తగ్గనివ్వరు.


వలస విధానం ఇప్పుడు లేదు. కాని అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పెత్తనం ఉంది. దాని వలన సామ్రాజ్యవాదం మూడవ ప్రపంచ దేశాల మీద నయా ఉదారవాద విధానాలను రుద్దగలుగుతోంది. అంతకు మునుపు వలస పాలనలో ఏ విధంగా కొల్లగొట్టగలిగారో, ఇప్పుడు ఈ నయా ఉదారవాద విధానాల ద్వారా కూడా అదే మాదిరిగా సామ్రాజ్యవాదులు మూడవ ప్రపంచ దేశాలను కొల్లగొట్టగలుగుతున్నారు.

(స్వేచ్ఛానుసరణ)

మణిపూర్ దైన్యం.. హైన్యం...

మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్న గుంపుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్ అయ్యింది. ఎంతటి హేయమైన చర్య ఇది! అక్కడ జరుగుతున్న అమానవీయ ఘటనలను చూసి దేశం యావత్తూ దిగ్భ్రాంతి చెందింది. అన్నింటికీ మించి తమని పోలీసులే ఆ గుంపుకి అప్పగించారంటూ ఒక బాధిత మహిళ చెప్పిన మాటలు మనసున్న ప్రతి ఒక్కరినీ కలచివేస్తున్నాయి. ప్రభుత్వాలు చేతులెత్తేస్తే తామే న్యాయం చేస్తామంటూ అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహంతో చెప్పడాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అర్థం చేసుకుని మత్తు వదలాలి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం పరిస్థితిని అదుపు చెయ్యాలి. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చడంలో అర్థం లేదు. అక్కడి ప్రభుత్వం పట్ల ఒక వైపు వారికి నమ్మకం లేదు. పక్షపాత వైఖరితో నమ్మకాన్ని పోగొట్టుకుంది. జాతుల మధ్య వైరం పెంచడం సులభమైన పని. మంటలు అంటుకున్న తర్వాత వాటిని ఆర్పడం కష్ట సాధ్యం. ఇప్పటికే ఆలస్యం అయ్యింది. మణిపూర్ గాయాల్ని మాన్పి శాంతి, సామరస్యతలను సాధించాలంటే ముందు అక్కడి ప్రజల్లో విశ్వాసం కలిగించాలి. కేంద్రం చేయాల్సిన మొదటి పని అది. మహిళల పట్ల నేరానికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించగలిగితే అది శాంతి స్థాపనకు మొదటి మెట్టు అవుతుంది. అక్కడ ఇంకా బాహ్య ప్రపంచానికి తెలియని ఎన్ని హీన నేరాలో? మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనేందుకుగానూ... కేంద్రం లోను, ఆ రాష్ట్రంలోను అధికారంలో వున్న బిజెపి చిత్తశుద్ధితో ప్రయత్నించడం అవసరం, అన్నివైపులా.

- డా. డి.వి.జి.శంకర రావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం.



ఆజ్యం పోసిన పాలకులు

భరతమాత వారసులం, నిజమైన దేశభక్తులం అంటూ అనునిత్యం గొప్పలు పోతుంటారు మోడీ, షా లు. చర్చిలను ధ్వంసం చేస్తున్న, మహిళలను వివస్త్రలు చేస్తున్న వీడియోలను విశ్వమంతా చూస్తుంటే దేశానికి అవమానమట. ఓవైపు దేశంలో మణిపూర్ రగులుతుంటే అటువైపు కూడా తొంగి చూడని ప్రధాని ఫ్రాన్స్ పర్యటన చేశారు. పార్లమెంటుకు రావడానికి ముందు మోడీ మనసు బాధ, ఆగ్రహంతో నిండిపోయిందంటూ కార్చిన మొసలి కన్నీరు మతోన్మాద పన్నీరే కదా. ప్రధాని పార్లమెంట్ బయట ఎందుకు ఆగ్రహం వెళ్లగక్కుతారు? పార్లమెంటులో మౌనం వహిస్తారెందుకు? ప్రజలకు మాయమాటలు, అబద్ధాలు చెప్తూ మతోన్మాదులకు అండదండలందించడాన్ని ఎలా అర్థంచేసుకోవాలి? గుజరాత్ మారణకాండను కళ్ళకు కట్టినట్లు వివరించిన తీస్తాసెల్వాద్‌కు శిక్షలెందుకు? మతోన్మాద ప్రమాదాన్ని వివరించిన తులసీ చందుకు బెదిరింపులెందుకు? ప్రజల మధ్య చిచ్చు పెట్టే పాలకులరా రాజీనామాకు సిద్ధమవ్వాలి. లేదా హిమాలయాల్లో జపం చేసుకోవాలి. అపుడే ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం తప్పుతుంది.

- వి.వెంకటేశ్వర్లు, లక్ష్మీనగర్, కర్నూలు.

ఎంతకాలం ఈ మౌనం?

ఇటీవల వెలుగు చూసిన మణిపూర్ అమానుష, అమానవీయ ఘటన హృదయాన్ని కలిచివేసింది. దు:ఖంతో గుండె మండిపోయింది. ముద్ద నోట్లోకి కూడా వెళ్లడం లేదు. రాజ్యం చేసిన గాయానికి భారతమాత సిగ్గుతో తలదించుకుంది. కుకీ మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన దేశ మహిళలకు మాత్రమే కాదు. దేశ సార్వభౌమత్వానికి కూడా అవమానమే. నడి రోడ్డు మీద దుర్ఘటనకు పాల్పడిన వాళ్లని ఏమీ చేయలేని మూర్ఖుడి పాలనలో ఉన్నందుకు ఆవేదన కట్టలు తెంచుకుంటోంది. తమ డబుల్ ఇంజన్ పాలన ఉన్న చోటే దాడులను నివారించలేని ప్రధాని... దేశ మహిళలకు ఏ విధంగా న్యాయం చేస్తారు? కంటి తుడుపు మాటలు సమస్యకు పరిష్కారమా? భారతంలో నిండు కురు సభలో ద్రౌపది వస్త్రాపహరణానికి కారకుడైన దుష్ట దుర్యోధనుడిని .... మహా సేనాని భీష్ముడు, పాండవులు ఏమీ చేయలేని నాటి దుస్థితిలోనే నేడు రాజ్యముందా? కళ్లకు గంతలు కట్టుకున్న ధృతరాష్ట్రుడిలా పాలకుల తీరు ఉందా! మేధావులూ స్పందించండి. దేశ ప్రజలారా...కళ్లతో చూసి కాళ్లతో నడిచి వెళ్లిపోకండి. నిలబడండి. ప్రశ్నించండి. మన ఇంటి బిడ్డకు జరిగిన అన్యాయంగా మణిపూర్ దారుణాన్ని ఖండించండి. నిర్లజ్జగా, నిర్భయంగా ప్రవర్తించిన నిందితుల వెనుకున్న అసలు దోషులను శిక్షించాలని కోరండి. గుండె గాయాల నుంచి రక్తం స్రవిస్తుంటే చేతులు కట్టుకున్న పాలకుల చేతల్ని నిలదీయండి.

- సుధాకిరణ్

పాలనా వైఫల్యమే

మే నెల నుంచి మణిపూర్ మంటల్లో కాలి బూడిద అవుతున్నా... దేశ ప్రధాని కనీసం ఒకసారైనా ఆ రాష్ట్రాన్ని సందర్శించిన దాఖలాలు లేవు. కానీ, అదే సమయంలో ఎన్నికల క్యాంపైన్ కోసం కర్ణాటక రాష్ట్రంలో పలుమార్లు పర్యటనలు చేశారు. అంటే ప్రజలు ఏమైపోయినా పర్వాలేదు. మాకు మాత్రం అధికారమే కావాలి అన్నట్లు ఉంది. అదే విధంగా భవిష్యత్తులో అధికారం చేపట్టేందుకు వివిధ పార్టీలతో కార్యాచరణ సమావేశాలు, విదేశీ పర్యటనలకు మాత్రం ప్రధాని మోడీకి సమయం ఉంటుంది. కానీ, దేశంలో ప్రజల సమస్యల్ని పరిష్కరించడానికి సమయం కేటాయించకపోవడం బాధాకరం. ప్రపంచానికి, ప్రజలకు వాస్తవాలు తెలియకుండా ఉండటానికి మాత్రం ఇంటర్నెట్ షట్‌డౌన్ చేయడం, మీడియాపై ఉక్కుపాదం మోపడం, ప్రజాస్వామ్య హక్కులను తుంగలో తొక్కడం చూస్తున్నాం. దేశ ప్రజలను కులాలు, తెగలు, మతాలు, భాషలంటూ విభజించే ధోరణులకు చెక్ పెట్టండి. ప్రజాస్వామ్య పద్ధతిలో, రాజ్యాంగ స్ఫూర్తితో పాలన అందించండి.

- ఐ. ప్రసాదరావు

ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ

ఈ అత్యాచార ఘటన చాలా ఆలస్యంగా వెలుగులోకి రావడం మొదలు ఇప్పటి దాకా మణిపూర్‌లో జరిగిన అల్లర్లలో దాదాపు 142 మంది హతులయ్యారు. అంటే ఆ రాష్ట్రంలో ఎంతటి భయనక రీతిలో రక్తం ఏరులై పారిందో మనం ఇట్టే ఊహించవచ్చు. ఇది ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ. సుప్రీంకోర్టు దృష్టికి వచ్చిన వెంటనే ఈ ఘోర అత్యాచారం, హింసాకాండకు కారకులైన వారిపై తక్షణమే కఠిన చర్యలకు ఆదేశించడం కొంతలో కొంత ఉపశమనం. ఏమాత్రం ఉపేక్షించకుండా ఆ నరరూప రాక్షసులు ఏ గుహల్లో, కొండల్లో దాక్కున్నా వారి జాడ కనుక్కొని, న్యాయస్థానం బోనులో ఎక్కించి శిక్షించాల్సిన గురుతర బాధ్యత డబుల్ ఇంజన్ సర్కారిది.

- బుగ్గన మధుసూదనరెడ్డి,
బేతంచెర్ల, నంద్యాల జిల్లా.

ఈశాన్యంలో దేశద్రోహం

ఓ పక్క
దేశ విజ్ఞానం
భూఉపరి తలం దాటి,
విను వీధుల్లోంచి దూసుకుంటూ
జాబిల్లికి చేరిపోతోంది!
మరోవైపు అజ్ఞానం
తల నుండి మోకాలికి
అక్కడ నుంచి అరికాలికి జారి,
వనితల్ని వివస్త్రలు చేసి,
వీధుల్లో ఊరేగిస్తూ పైశాచికమవుతోంది!
చంద్రయాన్ విజయానికి
ఉప్పొంగిపోవాలా?
మానవత్వాలు మసకబారుతున్న
ఈశాన్య ఊచకోతలకు
కుంగిపోవాలా?
వాళ్ల వైరుధ్యం
మతమో? తెగో? కావచ్చు!
అలాని, ఏకంగా
తలలే తెగాలా?!
ఎవరి పట్టు కోసమో?
ఆకుపచ్చని నేలపై
నెత్తుటి మరకలు చిందాలా?!
అమాయక గిరిజనం
బలిదానాలు కావాలా?
అడవి బిడ్డల్లో
అలజడులు రేపి
మానభంగాలు చేసేసి
ఊపిర్లు తీసేశాక కూడా
వాళ్లని మనుషులనుకుంటే పొరబాటే!
పరవశించే ప్రకృతిని
పొరుగు దేశాలు
పర్యాటక ప్రగతిగా మార్చుకుంటుంటే!
మణిపూర్‌లో మంటలు సృష్టించి
రాజకీయ లాభాలకు
యోచించే ఈ కుహనా వ్యూహకర్తలు
నిస్సందేహంగా దేశద్రోహులే!

- చిలుకూరి శ్రీనివాసరావు

ఆకలి కేకలు

- కుకీ శిబిరాలలో అరకొరగానే ఆహారం
- సరఫరాలను దోచుకుంటున్న మెయితీలు
- కొండెక్కి కూర్చున్న నిత్యావసరాల ధరలు

ఇంఫాల్ : మణిపూర్‌లో ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న భయాందోళనలతో సహాయ శిబిరాలలో తలదాచుకుంటున్న కుకీల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. రేషన్ సరుకులు తెచ్చుకోవడం కూడా గగనమవుతోంది. చురాచాంద్‌పూర్, తెంగ్‌నౌపాల్ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ఏ సహాయ శిబిరాన్ని దర్శించినా కన్నీటి గాథలు, ఆకలి కేకలు విన్పిస్తున్నాయి.

అది కుకీల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న చురాచాంద్‌పూర్‌లోని ఓ సహాయ శిబిరం. ఏడు నెలల గర్భిణి తెతియమ్ చిందరవందరగా పడి ఉన్న పాత బట్టల మధ్య ఓ హాలులో కూర్చొని ఉంది. ఆమె స్వగ్రామమైన సుగ్నూ మే 27న హింసాకాండలో అగ్నికి ఆహుతైంది. అప్పటి నుంచీ తెతియమ్ ఈ శిబిరంలోనే కాలం గడుపుతోంది. అత్యవసర మందుల కోసం రోజూ యంగ్ వైపై అసోసియేషన్ నడుపుతున్న సహాయ కేంద్రానికి వెళుతున్నా, ఆమె ఆశలు అడియాసలే అవుతున్నాయి. సహాయ శిబిరాలలో ఆహారం పరిమితంగానే అందుతోంది. రోజుకు రెండు పూటలా అన్నం, పప్పు ఇస్తున్నారు. దానితోనే కడుపు నింపుకోవాల్సి వస్తోంది. పౌష్టికాహారం లభించక, మందులు దొరక్క నానా ఇబ్బందులు పడుతున్న తెతియమ్ తన కడుపులో బిడ్డ పరిస్థితి ఏమవుతుందోనని ఆందోళన చెందుతోంది. ఇది ఒక్క తెరియమ్ కథే కాదు... ఏ సహాయ శిబిరంలో చూసినా ఆమె లాంటి వారు కన్పిస్తూనే ఉంటారు.


చురాచాంద్‌పూర్ సహాయ శిబిరంలో కిక్కిరిసివున్న కుకీలు

కొండ ప్రాంతాలలో దుర్భర జీవనం

నిరాశ్రయులైన ప్రజల కోసం చుర్‌చాంద్‌పూర్‌లో 105 సహాయ శిబిరాలు ఏర్పాటు చేశారు. రేషన్, ఇతర ప్రభుత్వ సహాయాలు పొందేందుకు బాధితులు అష్టకష్టాలు పడుతున్నారు. శిబిరాలలో వారికి భోజనం మాత్రమే దొరుకుతోంది. శిబిరాలలో తల దాచుకుంటున్న కుకీలకు ఆహారం, ఇతర నిత్యావసరాలు రవాణా కాకుండా మైతీలు అడ్డంకులు సృష్టిస్తున్నారని భద్రతా సిబ్బంది తెలిపారు. భద్రతా సిబ్బంది కుకీలకు బాసటగా ఉంటున్నారని, తాము నిత్యావసరాల సరఫరాలను అడ్డుకుంటున్న విషయం నిజమేనని మెయితీలు బాహాటంగానే చెబుతున్నారు. పలు ప్రాంతాలలో మే 3 నుంచే సమాచార వ్యవస్థ స్తంభించింది. ఇంఫాల్ నుంచి కొండ ప్రాంతాలకు సరకు రవాణాలో ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఆ ప్రాంతాలలో నివసిస్తున్న వారికి ఎఫ్‌సిఐ వద్ద ఉన్న నిల్వలే దిక్కవుతున్నాయి. ఇంఫాల్ మీదుగా వెళ్లే సరకు రవాణా వాహనాలను మెయితీలు అడ్డుకొని దోచుకుంటున్నారు. ఆ తర్వాత వాహనాలను తగలబెడుతున్నారు. దీనికితోడు కుకీల పట్ల అధికారులు వివక్ష ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారులు వారికి చాలినంత రేషన్ పంపడం లేదు. చిన్న పిల్లలకు అవసరమైన ఆహారం, మందులు, శానిటరీ వస్తువులు దొరకడం లేదు. ఇంఫాల్ నుండి గ్యాస్, ఇంధనం సరఫరా కాకుండా మెయితీలు అడ్డుకుంటున్నారు. కుకీలు నివసించే ప్రాంతాలలో నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. గ్యాస్ సిలిండర్ రూ.2,500 పలుకుతోంది. పెట్రోల్‌ను చీకటి బజారులో విక్రయిస్తున్నారు. ఎటిఎంల వద్ద చాంతాడంత క్యూలు కన్పిస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే కొండ ప్రాంతాలలో పరిపాలన అనేదే కన్పించడం లేదు. 'ఇక్కడ ప్రభుత్వమే లేదు. సౌకర్యాలూ లేవు. ఘర్షణలు మొదలైన తర్వాత ఒక్క బియ్యం గింజ కూడా రాలేదు. మేము ఆకలితో చనిపోవాలని మెయితీలు కోరుకుంటున్నారు. రోజువారీ కూలి డబ్బులతో బతికే వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. చుట్టుపక్కల వారు సాయం చేస్తుంటే ఎలాగోలా ప్రాణాలు నిలుపుకుంటున్నారు' అని ఓ యువకుడు ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసు అధికారులు సైతం అవసరమైన పత్రాల కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇంఫాల్ నుంచి పత్రాలు తెప్పించుకునేందుకు మైనారిటీలను ఉపయోగించుకోవాల్సి వస్తోందని, మైతీలు వారిని చూస్తే పట్టుకొని ఆ పత్రాలను దగ్ధం చేస్తున్నారని అధికారులు వాపోయారు.

జీవనోపాధి కోసం...

నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటడంతో సామాన్య ప్రజలు జీవనోపాధి కోసం వేరే మార్గాలను ఎంచుకుంటున్నారు. దినసరి వేతన కార్మికులు, చేనేత పనివారు పెట్రోల్ బంకుల ఎదుట కూర్చొని పెట్రోల్ నింపిన సీసాలు అమ్ముకుంటున్నారు. 750 మిల్లీలీటర్ల పెట్రోల్ సీసా రూ.120-150 పలుకుతోంది. అదే సమయంలో మెయితీలు కోసం నడుపుతున్న సహాయ శిబిరాలలో వేటికీ కొరత లేదు. వారు నివసిస్తున్న ప్రాంతాలలో జనజీవనం మామూలుగానే సాగుతోంది.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పండి

- రాష్ట్రపతికి ఆదివాసీ రచయితల లేఖ
- అమిత్ షా, బీరేన్ రాజీనామాలు కోరండి : ఎన్‌ఎపిఎం వినతి

న్యూఢిల్లీ : మణిపూర్‌లో శాంతిని నెలకొల్పేందుకు జోక్యం చేసుకోవాలని కోరుతూ ఆదివాసీ రచయితలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సోమవారం లేఖ రాశారు. 26 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 86 మంది గిరిజన రచయితలు లేఖపై సంతకాలు చేశారు. "రాష్ట్రపతి మణిపూర్‌లో శాంతిని నెలకొల్పేందుకు సహాయం చేయాలి" అని దేశంలోని కోట్లాది మంది గిరిజనుల తరపున... ఆల్ ఇండియా ఫస్ట్ నేషన్స్ (స్వదేశీ, ఆదివాసీ) రచయితల సదస్సు విజ్ఞప్తి చేసింది. ఆదివాసీ సాహితీవేత్తలమైన తాము ఈ హీనమైన, అమానుష చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. గిరిజన మహిళలపై క్రూరమైన దాడికి పాల్పడిన ప్రత్యక్ష, పరోక్ష నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మణిపూర్‌లో పర్యటించండి : రాష్ట్రపతికి ఎన్‌ఎపిఎం వినతి

మే 4న మణిపూర్‌లో కుకీ యువతులపై జరిగిన లైంగిక దాడిని నేషనల్ అలయన్స్ ఫర్ పీపుల్స్ మూవ్‌మెంట్ (ఎన్‌ఎపిఎం) తీవ్రంగా ఖండించింది. రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక చర్యలపై విచారణ జరిపేందుకు స్వతంత్ర దర్యాప్తు సంస్థను ఏర్పాటు చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కోరింది. పర్యావరణవేత్త మేధా పాట్కర్, మాజీ అధికారి హర్ష్ మందర్, కవి మీనా కందసామి సహా 3,256 మంది ఆ లేఖపై సంతకాలు చేశారు. రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల జాబితాలో ఏకపక్షంగా ఎటువంటి అదనపు చేర్పులు చేయకుండా చర్యలు తీసుకోవాలని, అందుకు తగిన హామీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 'మే 4న జరిగిన అమానుష ఘటనకు సంబంధించి నిందితులను అరెస్ట్ చేయడంలో పోలీసులు తీవ్రమైన జాప్యం చేశారు. గిరిజన మహిళ అయిన మీరు రాష్ట్రంలో పర్యటించండి. స్వయంగా పరిస్థితిని తెలుసుకోండి. ప్రభుత్వం నిస్సిగ్గుగా విభజన రాజకీయాలు చేయడం దురదృష్టకరం. క్షమించరాని నేరం. విద్వేషపూరిత నేరాలు అడ్డూ అదుపూ లేకుండా సాగేందుకు సాయపడింది. ఆ నేరాలకు పాల్పడిన వారిని శిక్షించకుండా వదిలేసింది. దారుణ వైఫల్యాలకు నైతిక, చట్టపరమైన బాధ్యత వహించి రాజీనామా చేయాల్సిందిగా అమిత్ షా, బీరేన్ సింగ్‌లను కోరండి' అని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

మణిపూర్‌పై భగ్గుమన్న పార్లమెంటు

(మొదటి పేజీ తరువాయి)

ఓబ్రెయిన్ జోక్యం చేసుకుని బిజెపి ఎంపీల పేర్లను పార్టీ పేరుతో సహా చదివారు, ప్రతిపక్ష ఎంపిల పేర్లు చదివేటప్పుడు పార్టీ పేరును ఎందుకు చదవలేదని ప్రశ్నించారు. ప్రతిపక్ష ఎంపీలంతా ఓబ్రెయిన్‌కు మద్దతుగా నిలిచారు. ఆగ్రహం వ్యక్తం చేసిన ధన్‌ఖర్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశం కాగానే ఆందోళన కొనసాగించిన ఆప్ రాజ్యసభ పక్షనేత సంజయ్ సింగ్‌ను సస్పెండ్ చేస్తూ సభా నాయకుడు, కేంద్ర మంత్రి పియూష్ గోయెల్ తీర్మానం ప్రవేశపెట్టగా, జగదీప్ ధన్‌ఖర్ మూజువాణి ఓటుతో ఆమోదించారు. సమావేశాలు జరిగే అన్ని రోజులూ సంజయ్ సింగ్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించి, సభను వాయిదా వేశారు. మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి ప్రారంభమైన సభ 27 సెకెన్లలో మళ్లీ వాయిదా పడింది. తరువాత ప్రారంభమైన సభలో సంజయ్ సింగ్‌ను సభ నుంచి వెళ్లిపోవాలని డిప్యూటీ ఛైర్మన్ నారాయణ్ సింగ్ కోరారు. ఆయన వెళ్లకపోయేసరికి సభను మంగళవారానికి వాయిదా వేశారు.

లోక్‌సభ ప్రారంభం కాగానే మణిపూర్ అంశంపై ప్రధాని మోడీ సభలో సమాధానం ఇవ్వాలని ప్రతిపక్ష నేత అధిర్‌రంజన్ చౌదరి డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీల ఎంపిలు తమ స్థానాల్లోంచి లేచి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. స్పీకరు ఓంబిర్లా స్పందిస్తూ.. దీనిపై ప్రభుత్వం సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని, కేంద్రం తరపున ఎవరు సమాధానమివ్వాలో మీరు ఆదేశించలేరని అన్నారు. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైతం చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. సభ్యుల నినాదాల మధ్యే ప్రశ్నోత్తరాలను స్పీకరు చేపట్టారు. అనంతరం కొద్దిసేపటికే సభ 12 గంటలకు వాయిదా పడింది. అనంతరం ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళనల మధ్యే డిఎన్‌ఎ టెక్నాలజీ రెగ్యులేషన్ బిల్లును కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఉపసంహరించుకున్నారు. మంత్రి మనుసుఖ్ మాండవీయా నేషనల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ కమిషన్ బిల్లు, నేషనల్ డెంటల్ కమిషన్ బిల్లు, మంత్రి వీరేంద్ర కుమార్ రాజ్యాంగం (షెడ్యూల్డ్ కులాలు) ఆర్డర్ (సవరణ) బిల్లును ప్రవేశపెట్టారు. ప్యానెల్ స్పీకర్ రాజేంద్ర అగర్వాల్ సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభ నిమిషంలోనే మధ్యాహ్నం 2:30 గంటలకు వాయిదా పడింది. అనంతరం ప్రారంభమైన సభలో హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ మణిపూర్‌లో హింసాకాండపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, చర్చ సజావుగా జరిగేలా సహకరించాలని ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు.

గాంధీ విగ్రహం వద్ద ఆందోళన

ప్రధాని ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు పార్లమెంట్ ఆవరణలో, మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేశాయి. రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ప్రధాని ప్రజా ప్రతినిధులు కూర్చునే పార్లమెంటులో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్ గురించి అంతర్జాతీయంగా చర్చ జరుగుతున్నా.. మన దేశంలో చర్చ లేదని, ఇది సిగ్గుచేటని ఎస్‌పి ఎంపి జయా బచ్చన్ అన్నారు.

26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ

జ్ఞానవాపీ మసీదులో సర్వే ఆపండి

- ఎఎస్‌ఐకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : జ్ఞానవాపీ మసీదు ప్రాంగణంలో ఈ నెల 26 సాయంత్రం 5 గంటల వరకూ శాస్త్రీయ సర్వే చేయవద్దని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్‌ఐ)ను సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. ఈ నెల 21న వారణాసి జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాలకు వ్యతిరేకంగా జ్ఞానవాపీ మసీదు యాజమాన్యం దాఖలు చేసిన పిటీషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జిల్లా కోర్టు ఆదేశాలపై అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించడానికి మసీదు యాజమాన్యానికి సమయం ఇచ్చే విధంగా సుప్రీంకోర్టు ఈ విధంగా స్టే ఉత్తర్వులు జారీ చేసింది. తమ స్టే ఉత్తర్వులు గడువు (జులై 26 సాయంత్రం 5 గంటల వరకూ) ముగిసే లోగా మసీదు యాజమాన్యం దాఖలు చేసే పిటీషన్‌ను తగిన బెంచ్ ముందు విచారణ కోసం ఉంచాలని కూడా అలహాబాద్ హైకోర్టు రిజిస్ట్రీని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. వారణాసి జిల్లా కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా మసీదు యాజమాన్యం తరుపున న్యాయవాది హుజిఫియా అహ్మదీ ఈ పిటీషన్ దాఖలు చేశారు. 'జ్ఞానవాపీ మసీదు 1600 నుంచి ప్రార్థనాస్థలంగా ఉంది' అని అహ్మదీ తన వాదనలు వినిపించారు.

'నెలసరి శుభ్రత'పై పాలసీ ఆలస్యం..

రాష్ట్రాలపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ: పాఠశాలల్లో చదువుతున్న బాలికల రుతుక్రమ పరిశుభ్రతపై జాతీయ విధానాన్ని రూపొందించేందుకు అభిప్రాయాలు పంపడంలో రాష్ట్రాలు అలసత్వం ప్రదర్శించడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆగస్టు 31లోగా ఈ అంశంపై రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ స్పందనలను కేంద్రానికి సమర్పించాలని ఆదేశించింది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని 6-12 తరగతుల బాలికలకు ఉచితంగా శానిటరీ ప్యాడ్‌లు అందించాలని, పాఠశాలల్లో ప్రత్యేక మరుగుదొడ్ల సౌకర్యం కల్పించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు గతంలో విచారణ చేపట్టింది. పాఠశాలల్లో చదివే బాలికలు రుతుక్రమ పరిశుభ్రతను పాటించేలా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఓ జాతీయ విధానాన్ని అవలంబించాలని సూచించింది. ఈ విధానాన్ని రూపొందించేందుకు రాష్ట్రాల నుంచి అభిప్రాయాలు, సలహాలు-సూచనలను సేకరించాలని ఈ ఏడాది ఏప్రిల్ 10న కేంద్రాన్ని ఆదేశించింది.

కేంద్రం అప్పు రూ.155.6 లక్షల కోట్లు

- కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2014 మార్చి 31 అంటే నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం కోల్పోయిన నాటికి కేంద్ర ప్రభుత్వం అప్పు రూ.58.6 లక్షల కోట్లు కాగా, 2023 మార్చి 31 నాటికి కేంద్ర ప్రభుత్వ అప్పు రూ.155.6 లక్షల కోట్లు (జిడిపిలో 57.1 శాతం)కు పెరిగింది. సోమవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం అప్పు ప్రతి ఏడాదీ పెరుగుతూనే ఉంది. అప్పుకు చెల్లిస్తున్న వడ్డీ కూడా ప్రతి ఏడాదీ పెరుగుతూనే ఉంది.

గత ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం అప్పు

సంవత్సరం	అప్పు (లక్షల కోట్లు)	చెల్లిస్తున్న వడ్డీ (లక్షల కోట్లు)
2018-19	రూ.93.3	రూ.5.83
2019-20	రూ.105.1	రూ.6.12
2020-21	రూ.121.9	రూ.6.80
2021-22	రూ.138.7	రూ.8.05
2022-23	రూ.155.6	రూ.9.28

సైన్యంలో 3,367 వైద్య సిబ్బంది పోస్టులు ఖాళీ

త్రివిధ దళాల్లో 3,367 వైద్య సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి అజయ్ భట్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఇండియన్ ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నావీలో 630 డాక్టర్, 73 డెంటల్, 701 నర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇతర మెడికల్ స్టాఫ్ 1,960 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సెంట్రల్ యూనివర్సిటీల్లో 5,825 టీచింగ్ పోస్టులు ఖాళీ

దేశంలోని 45 సెంట్రల్ యూనివర్సిటీల్లో 5,825 టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. దేశంలో 45 సెంట్రల్ యూనివర్సిటీల్లో ఎస్‌టి 516, ఎస్‌సి 861, ఒబిసి 2,185, జనరల్ కేటగిరీ 1,662 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అలాగే 2023 ఏప్రిల్ 1 నాటికి సెంట్రల్ యూనివర్సిటీల్లో 15,390 నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని మరో ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ సమాధానమిచ్చారు.

96,261 కంపెనీలు స్వచ్ఛందంగా నిష్క్రమణ

దేశంలో గడిచిన ఐదేళ్లలో 96,261 కంపెనీలు స్వచ్ఛందంగా నిష్క్రమించాయని కేంద్ర మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2018 ఏప్రిల్ 1 నుంచి, 2023 మార్చి 31 వరకు 96,261 కంపెనీలు స్వచ్ఛందంగా నిష్క్రమించాయని పేర్కొన్నారు.

మరో 14 మంది నిందితుల గుర్తింపు

ఇంఫాల్ : దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తిన మణిపూర్ ఘోరంపై గత నెల 21న కాంగ్‌పోక్పీ జిల్లాలోని నమోదైన కేసుకు సంబంధించి మరో 14మందిని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఆరుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే.

స్పెయిన్‌లో హంగ్ పార్లమెంట్

- మితవాద కూటమికి సీట్లు పెరిగినా మెజారిటీ దక్కలేదు
- గట్టి పోటీ ఇచ్చిన లెఫ్ట్
- ఇతరుల మద్దతు కోసం ఇరు పక్షాలూ యత్నాలు



పాపులర్ పార్టిదో (పీపుల్స్ పార్టీ) అధినేత ఆల్బెర్టో నునెజ్ ఫెయిజో (ఎడమవైపు), ప్రధాన మంత్రి, సోషలిస్టు పార్టీ తరపున తిరిగి ఎన్నికైన పెట్రో శాంఛెజ్.

మాడ్రిడ్: స్పెయిన్ పార్లమెంటు ఎన్నికల్లో ఆల్బెర్టో నునెజ్ ఫెయిజో నేతృత్వంలోని కన్సర్వేటివ్స్‌కు అధిక స్థానాలు వచ్చినప్పటికీ, సొంతంగా కానీ, మిత్రపక్షమైన వోక్స్‌తో జట్టు కట్టినా కానీ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీని సాధించలేకపోయింది. లెఫ్ట్ నుంచి గట్టి ప్రతిఘటన ఎదురవడంతో అధికారం చేజిక్కించుకోవాలన్న ఆల్బెర్టో సునెజ్ ఆశలు అంత సులువుగా నెరవేరే స్థితి కానరావడం లేదు. పెడ్రో శాంచెజ్ నేతృత్వంలో సోషలిస్టులు గత ఎన్నికలతో పోల్చితే సీట్లు, ఓట్లు పెంచుకున్నారు. భావ సారూప్యత గల సుమేర్, ఇతర పార్టీలు, గ్రూపులను కలుపుకుని ప్రభుత్వ ఏర్పాటుకు వారు కూడా ప్రయత్నిస్తున్నారు. వారం రోజుల క్రితం వరకు 168 సీట్లు గెలుచుకుని సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని కలలు గంటూ వచ్చిన పాపులర్ పార్టీకి ఈ ఫలితాలు ఒకింత షాకిచ్చాయనే చెప్పాలి. మొత్తం 350 స్థానాలున్న పార్లమెంటు దిగువ సభలో సాధారణ మెజార్టీకి 176 సీట్ల రావాల్సి ఉండగా ఆ పార్టీకి 136 సీట్లు మాత్రమే వచ్చాయి. అయితే, 2019 నవంబరులో జరిగిన ఎన్నికలతో పోల్చితే 47 సీట్లు అది అధికంగా సాధించింది. మరో వైపు దాని మిత్ర పక్షమైన మతతత్వ పార్టీ వోక్స్ బలం 52 నుంచి 33కి పడిపోయింది. ఈ రెండు పార్టీలు కలిసినా మ్యాజిక్ ఫిగర్ (176) కు ఏడు సీట్లు తక్కువ. చిన్న చిన్న గ్రూపులుగా ఉన్న సిసి, యుపిఎన్ వంటి వాటితో అది జట్టు కట్టినా దాని బలం 171 సీట్ల వద్దే ఆగిపోతున్నది. కాబట్టి ఫెయిజో ప్రధాని కావడం చాలా కష్టంతో కూడుకున్నది. సోషలిస్టు నాయకుడు శాంఛెజ్ పరిస్థితి కూడా నల్లేరు మీద నడకేమీ కాదు. సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు అనేక హర్డిల్స్‌ను దాటాల్సి ఉంది. సోషలిస్టు పార్టీ (పిఎస్‌ఒఇ)కి 122 సీట్లు రాగా, దాని మిత్రపక్షమైన సుమర్‌కు 31 స్థానాలు వచ్చాయి. 2019 ఎన్నికలతో పోల్చితే పిఎస్‌ఒఇకి రెండు సీట్లు పెరగ్గా, సుమర్‌కు నాలుగు సీట్లు తగ్గాయి. ఈ రెండు పార్టీలకు కలిపి 153 సీట్లు వచ్చాయి. ఇతరులకు 28 స్థానాలు లభించాయి. వీరు ఎటువైపు మొగ్గు చూపుతారనేదానిపై రెండు ప్రధాన కూటముల భవిష్యత్తు ఆధారపడి ఉంది.

స్పెయిన్‌లో ప్రతి నాలుగేళ్లకొకసారి పార్లమెంటు, అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి.

డిఒపి నియామక కేసులో నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ (డిఒపి)గా జల్లా సుదర్శన్‌రెడ్డి నియామకాన్ని సవాల్ చేసిన కేసులో మధ్యంతర ఆదేశాలకు హైకోర్టు నిరాకరించింది. నియామక ఉత్తర్వుల అమలును నిలుపుదల చేయబోమని స్పష్టం చేసింది. నియామకాన్ని సవాల్ చేసిన కేసులో ప్రతివాదులుగా ఉన్న హోంశాఖ ముఖ్య కార్యదర్శి, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, డిఒపితోపాటు వ్యక్తిగత హోదాలో సుదర్శన్‌రెడ్డికి నోటీసులిచ్చింది. విచారణను ఆగస్టు 21కి వాయిదా వేస్తూ తాత్కాలిక చీఫ్ జస్టిస్ ఎవి శేషసాయి, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

మా నిధులు మాకు ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ వలంటీర్లను, గ్రామ సచివాలయాలను 73, 74వ రాజ్యాంగ సవరణ చట్టంలోని ఆర్టికల్ 243 జి, 11వ షెడ్యూల్ ప్రకారం గ్రామ పంచాయతీలలో విలీనం చేసి సర్పంచుల ఆధ్వర్యంలోనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్లకు వినతిపత్రం అందజేశారు. ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు.

కృష్ణా జిల్లా మచిలీపట్నంలో సర్పంచులు కలెక్టర్ పి.రాజాబాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం అక్కడే బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవిబి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రెండున్నరేళ్లుగా గ్రామాల్లో అభివృద్ధి జరగడం లేదన్నారు. నిధులు లేకపోవడంతో రోడ్లు, డ్రెయిన్లు, తాగు నీరు, వీధి దీపాలను ప్రజలకు సమకూర్చలేక సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారని తెలిపారు. 14, 15వ ఆర్థిక సంఘాల నిధులు రూ.8,660 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అభివృద్ధి పథకాలకు మళ్లించడం శోచనీయమన్నారు. ఈ నిధులను వెంటనే ఆయా పంచాయతీల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు గోలి వసంతకుమార్, గౌరవ సలహాదారు ముల్లంగి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నాలో ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిరు ప్రతాపరెడ్డి ప్రసంగించారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సర్పంచులు ధర్నా చేశారు. కలెక్టర్ స్పందించకపోవడంతో స్పందన హాలు ఎదుట బైఠాయించారు. ఏలూరులో ఉమ్మడి పశ్చిమగోదావరిలోని సర్పంచులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వర్షంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. నెల్లూరులో విఆర్‌సి సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు నెల్లూరు ఉమ్మడి జిల్లాలోని సర్పంచులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. శ్రీకాకుళంలో జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేశారు. అనంతరం స్పందనలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతపురం, శ్రీసత్యసాయి, విజయనగరం కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహించారు.



మీకోసం

కాకరకాయలను ముక్కలుగా కట్‌చేసి ఫ్రిజ్‌లో నిల్వ చేస్తే పండిపోకుండా ఉంటాయి.

జీవన సౌరభం

కష్టపడాలనుకునే వారికి వంద మార్గాలుంటాయి. పని తప్పించుకునే వారికి వెయ్యి కారణాలుంటాయి. గెలవడానికి కారణాలు కాదు, మార్గాలను అన్వేషించాలి.

బాలలం

చిట్టిపొట్టి పిల్లలం
నవ్వులతో తుళ్లిపడే మల్లెలం
ఏటిపాటలో వర్షపు నాట్యంలో
చిందేసే బాలలం

రోజుకో చాక్లెట్ పూటకో బిస్కట్
నోరూరించే పల్లరసం
హార్లిక్స్ ఇచ్చే ఉత్సాహం
కార్టూన్ నెట్వర్కే
మా బాలల ప్రపంచం

అచ్చటా ముచ్చటా
మామ్మ తాతయ్యల ఒడిలోనే
కీలుగుర్రమైనా ఏనుగు సవారైనా
నాన్న వీపు మీదే
గోరుముద్దలంటే అమ్మదే రాజ్యం
అల్లరంటే మాదే నిత్యం

బాలలం మేము బాలలం
భావి భారత పౌరులం
దేశాన్ని రక్షించబోయే జవానులం
ప్రపంచానికి చిరునామే మా చిరుప్రాయం



ఎన్. లహరి,
హైదరాబాద్
9885535506





కనిపెట్టండి

పిల్లలూ ఇక్కడ ఇచ్చిన బొమ్మలో ఐదు తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ



గాలి హితేశ్రీ,
5వ తరగతి,
శ్రీచైతన్య టెక్నో స్కూల్,
మదనపల్లి,
అన్నమయ్య జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కళ్లు జాగ్రత్త !

వర్షాకాలం వచ్చిందంటే చాలు ... మేమున్నామంటూ ఫ్లూ, దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధులు వచ్చేస్తూ ఉంటాయి. అలాంటి సీజనల్ వ్యాధుల్లో ఒకటి కండ్ల కలక. వర్షాకాలంలో కండ్లకలకతో పాటు కళ్లు పొడిబారడం, చికాకు, దురద సమస్యలు వస్తాయి. రాష్ట్రంలో చాలాచోట్ల ఇప్పటికే కండ్లకలక ప్రబలి ఉంది.

కలక సోకితే కళ్ళు ఎర్రగా మారి వాపుతో ఇబ్బంది పెడుతుంటాయి. కళ్ళునొప్పితో పాటు కంటి నుంచి నీరు కారుతుంది. కండ్లకలక అనేది బ్యాక్టీరియా లేదా వైరల్ ఇన్ఫెక్షన్. ఇది అంటువ్యాధి. కొద్దిరోజుల్లోనే బాధితుల సంఖ్య విపరీతంగా పెరుగుతుంది. కండ్ల కలక నుంచి రక్షించుకోవడానికి పరిశుభ్రత, జాగ్రత్తలు పాటించడం చాలా ముఖ్యం. ఎల్లప్పుడూ చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. చేతులు శుభ్రంగా లేకుండా కళ్ళను తాకకూడదని కంటి వైద్య నిపుణులు చెబుతున్నారు. కండ్లకలకను 'పింక్ ఐ' అని కూడా పిలుస్తారు. ఇది కంటిలోని పొర (కంజక్టివా)కు ఇన్ఫెక్షన్ సోకి, దాని ఫలితంగా కలిగిన వాపు. కంజక్టివా అనేది కనురెప్పను, కళ్ళలోని తెల్లని భాగాన్ని కప్పి ఉంచే పారదర్శక పొర. కళ్ళ కలకలు ఇన్ఫెక్షన్ కారణంగా పారదర్శక పొర ఎరుపు లేదా గులాబీ రంగులోకి మారడానికి కారణమవుతాయి.


నిర్లక్ష్యం చేయొద్దు

సాధారణ కండ్ల కలక వస్తే వారం పాటు ఇబ్బంది పెట్టిన తర్వాత తగ్గిపోతుంది. అదే వైరస్‌తో కండ్ల కలక వస్తే మూడు వారాల పాటు ఉండొచ్చు. నవజాత శిశువులు, నెలలోపున్న వారికి వస్తే మాత్రం ప్రమాదకరంగా మారుతుంది. తెల్లని పొర నుంచి కంటి గుడ్డు, కార్నియాకు విస్తరిస్తే చూపు మందగిస్తుంది. కార్నియాకు ఇన్‌ఫెక్షన్ సోకి అల్సర్ వచ్చే అవకాశమూ ఉంటుంది. రంధ్రాలు పడే ఛాన్స్ కూడా ఉంది. ఇలాంటి పరిస్థితి ఏర్పడితే చూపు కూడా పోయే అవకాశం ఉంది.

కంటి ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి.

అధిక వర్షాలతో కంటి ఇన్ఫెక్షన్లు

కళ్లు శరీరానికి దీపాల వంటివి. వాటిని ఎల్లవేళల కాపాడుకోకపోతే దృష్టిలోపాలు తలెత్తే ప్రమాదం ఉంది. సుదీర్ఘకాలంగా కురుస్తున్న వానల వల్ల కండ్లకలక (కంజెక్టివైటీస్) వంటి కంటి ఇన్ఫెక్షన్లు పెరుగుతున్నట్లు నివేదికలు వెల్లడించాయి. కంటి గుడ్డు చుట్టూ ఉండే తెల్లని పొర, కంటి రెప్పల వెనుక ఉండే పొరలను కంజెటైవా అని అంటారు. కళ్లలోకి దుమ్ము, ధూళి, నీళ్ల వంటివి పడటంవల్ల కండ్ల కలకకు కారణమయ్యే ఇన్‌ఫెక్షన్ వల్ల బ్యాక్టీరియా, వైరస్ ఎక్కువగా వ్యాపిస్తుంది.



స్వీయ వైద్యం వద్దు

కండ్ల కలక సమస్య తలెత్తితే.. స్వీయ వైద్యం చేసుకోవడం కంటి ఆరోగ్యానికి ఎంతమాత్రం మంచిదికాదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వైరస్ ఎక్కువగా సోకడం వల్ల కండ్ల కలక ఉన్న రోగుల సంఖ్య నానాటికి పెరుగుతోంది. కండ్ల కలక రోగులను సాధారణంగా వారం రోజుల పాటు ఇబ్బంది పెడుతుంది. ఆ తర్వాత తగ్గిపోతుంది. ఇతరులకు వ్యాప్తి చెందితే అది మూడు వారాలపాటు వేధిస్తుంది. కంటిలోపల ఉండే తెల్లని పొర నుంచి కంటి గుడ్డుకు వ్యాప్తిస్తే చూపు మందగించే ప్రమాదం ఉంది. ఒక్కోసారి కార్నియాకు రంధ్రాలు కూడా పడతాయి. అలాంటి పరిస్థితుల్లో కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంది. కండ్లకలక లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని కంటి వైద్యుడి (ఆప్తమాలజిస్ట్)ని సంప్రదించాలి. ఐ డ్రాప్స్‌తో స్వీయ వైద్యం చేసుకోకూడదు. ఇలా చేస్తే కళ్లపై దీర్ఘకాలిక దుష్ప్రభావాలు చూపుతాయి.

తీసుకోవల్సిన జాగ్రత్తలు..

కండ్లకలక వచ్చినప్పుడు ఎట్టిపరిస్థితుల్లో కళ్లను నులమకూడదు. కంటి నుంచి నీళ్లు కారితే టిషఊ్యతో తుడిచి వెంటనే డస్ట్‌బిన్‌లో పారవేయండి.

కండ్లకలక ఒకరి నుంచి మరొకరికి సులువుగా వ్యాపిస్తుంది. కళ్లను తాకి, ఆ చేత్తో ఇతరును తాకితే వెంటనే ఈ వ్యాధి వారికి కూడా వ్యాపిస్తుంది.

కండ్లకలకతో బాధపడే వ్యక్తులు కాంటాక్ట్ లెన్సులు వాడటం మానేయాలి.

యాంటీ బయాటిక్ డ్రాప్స్ వాడాలి. నీళ్లతో తరచూ కళ్లను కడుగుతుంటే దురద అనిపించదు.

కండ్ల కలక లక్షణాలివే...

- కండ్లు ఎర్రబారుతాయి. కంట్లోంచి నీరు కారుతుంది. కంటి రెప్పలు ఉబ్బిపోతాయి.
- రాత్రి నిద్రపోయినపుడు అతుక్కొనిపోతాయి. పుసులు వస్తాయి.
- కొంతమందికి మందులు వాడకపోయినా వారంలో తగ్గిపోతుంది.
- కంటికి సమస్యలు రాకుండా ఉండేందుకు యాంటీ బయోటిక్ డ్రాప్స్ వాడాలి.
- కంటిని తరచుగా నీటితో కడుక్కోవాలి. దీంతో తొందరగా తగ్గిపోతుంది.
- కండ్ల కలక వచ్చిన వ్యక్తులకు దూరంగా ఉండాలి. వాళ్ల వాడిన వస్తువులు వాడొద్దు.



వైరస్‌తోనే కండ్ల కలక



సీజన్ మారే క్రమంలో వైరస్‌తో కండ్లకలక వస్తుంది. పెద్ద ప్రమాదకరం ఏమీ కాదు. వస్తే కలిగించే బాధ అంతా ఇంతా కాదు. బయట గాలికి తిరగడానికి లేదు. ఇతరులతో మాట్లాడడానికి లేదు. అలా చేస్తే గాలి ద్వారా ఇతరులకు సోకే అవకాశం ఉంది. అలాగే గాలి కారణంగా వ్యాధి మరింత ఎక్కువ అయ్యే అవకాశం ఉంది. కండ్ల కలక ముఖ్యంగా వైరస్, బాక్టీరియా ద్వారా కళ్ళకి కలిగే ఇన్‌ఫెక్షన్ సోకుతుంది. దీంట్లో ముఖ్యంగా కళ్ళు బాగా ఎర్రబడి నీళ్ళు కారడం, కళ్ళమంటలు, కళ్ళలో పొడుచుకుంటున్నట్లుంది. బాధ, సరిగ్గా చూడలేకపోవడం ముఖ్య లక్షణాలు. ఇది ఒక అంటువ్యాధి, చేతి రుమాలు, తువ్వాలు ఒకళ్ళు వాడినవి ఇంకొకళ్ళు వాడడం, వ్యాధి సోకిన వారు ఇతరులతో చాలా దగ్గరగా ఉండడం వల్ల తొందరగా వస్తుంది. వ్యాధి సోకిన వారు గోరువెచ్చని నీళ్ళతో తరచూ కళ్ళు కడుగుతూ ఉండాలి. వీలైనంతవరకూ నల్లటి కళ్ళజోడు ధరించాలి. చేతి రుమాలు, టవల్‌ను ఇతరులని వాడనీయకూడదు. డాక్టరు సలహాపై కళ్ళలో మందు చుక్కలు వాడాలి.

జి.గీతాభాయి,
కృష్ణాజిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి, మచిలీపట్నం

కంటి ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి



ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యంపై ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలి. కండ్లకలక వ్యాధి సోకినా, లేకపోయినా, చేతులతో కళ్లను తాకకుండా ఉండాలి. కళ్ళను తాకాల్సివస్తే ఎల్లప్పుడూ ముందు, తరువాత చేతులను కడుక్కోవాలి. కళ్ళ నుంచి ఏదైనా నలుసులు లేదా చికాకును కలిగించే వాటిని శుభ్రపరచడానికి టిష్యూ కాగితాలను కూడా ఉపయోగించొచ్చు. కాంటాక్ట్ లెన్స్‌లు కళ్ళకు చికాకు కలిగిస్తాయి, ప్రత్యేకించి అవి ఎక్కువ కాలం ధరిస్తే కళ్లను రుద్దాలనే కోరికను సృష్టించొచ్చు. కాంటాక్ట్ లెన్సులు ఉపయోగించే వారైతే, కొంత కాలం పాటు కళ్లద్దాలు వాడండి. వైరస్ లేదా బ్యాక్టీరియా అనేది మీ కంజక్టివా ఉపరితలంపై నివసిస్తుంటే, మీ కనురెప్పలను శుభ్రం చేయడం ద్వారా వైరస్ లేదా బ్యాక్టీరియాను తీసివేయడంలో సహాయపడుతుంది. ఇది చికాకును కూడా తగ్గిస్తుంది. కళ్ళు వదులుగా తయారయ్యేలా చేస్తుంది.

డాక్టర్ సూరపనేని ప్రవీణ్,
కంటి వైద్యనిపుణులు, ఉదయనేత కంటివైద్యశాల, విజయవాడ

ఇజ్రాయిల్‌లో నిరసనల మధ్య
న్యాయ సంస్కరణల బిల్లు ఆమోదం

జెరూసలెం: భారీ నిరసనల మధ్య వివాదాస్పద న్యాయ సంస్కరణల బిల్లును నెతన్యాహు ప్రభుత్వం సోమవారం ఇజ్రాయిల్ పార్లమెంటు (నెసెట్) లో ఆమోదింపజేసుకుంది. ప్రతిపక్షాలు ఓటింగ్‌ను బహిష్కరించిన నేపథ్యంలో 64-0 తేడాతో బిల్లు ఆమోదం పొందినట్టు స్పీకర్ ప్రకటించారు. ప్రభుత్వ నిర్ణయాలను రద్దు చేసే అధికారం న్యాయస్థానాలకు లేకుండా చేసేందుకు నెతన్యాహు ఈ బిల్లును తీసుకొచ్చారు.బిల్లుపై తుది ఓటింగ్‌ను బహిష్కరించిన ప్రతిపక్షాలు సభాపతి చాంబర్‌లోకి దూసుకెళ్లి సిగ్గు ..సిగ్గు అంటూ నినదించారు. బిల్లుపై రాజీకి నెతన్యాహు ససేమిరా అంటూ ఓటింగ్‌కు పెట్టారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా గత కొన్ని నెలలుగా ఇజ్రాయిల్ అంతటా భారీ నిరసనలు కొనసాగుతున్నాయి. సోమ వారం కూడా ఈ బిల్లుకు వ్యతిరేకంగా పెద్దయెత్తున నిరసనలు చేపట్టారు. 56 ఏళ్లుగా వెస్ట్‌బ్యాంక్ ను ఇజ్రాయిల్ అన్యాయంగా ఆక్రమించుకుని, అక్కడ యూదులకు పెద్దయెత్తున



నివాసాలను నిర్మిస్తోంది. పాలస్తీనీయులను సొంత గడ్డపై శరణార్థులుగా మార్చుతోంది. ఇప్పుడీ బిల్లు ఆమోదం పొందడంతో యూదు దురహంకార నెతన్యాహు ప్రభుత్వ నిరంకుశత్వానికి ఇక అడ్డు అదుపు ఉండదని ప్రజాతంత్రవాదులు పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సౌత్ గెలుపుపై నీళ్లు

- నార్త్-ఈస్ట్-జోన్‌పై వెస్ట్‌జోన్,
- సెంట్రల్‌జోన్‌పై ఈస్ట్‌జోన్ గెలుపు
- దేవధర్ ట్రోఫీ

పుదుచ్చేరి: 48వ దేవధర్ ట్రోఫీ లిస్ట్-ఏ వన్డే టోర్నమెంట్‌లో సౌత్-నార్త్‌జోన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా.. ఇతర మ్యాచుల్లో నార్త్, ఈస్ట్‌జోన్ జట్లు విజయం సాధించాయి. పాండిచ్చేరిలోని క్యాప్ సీహం గ్రౌండ్‌లో సోమవారం జరిగిన మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 303పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఓపెనర్లు రోహన్(70), కెప్టెన్ మయాంక్ అగర్వాల్(64)కి తోడు నారాయణ్ జగదీశన్(72) అర్ధసెంచరీలతో రాణించారు. రికీ బుయ్(31), అరుణ్ కార్తీక్(21) ఫర్వాలేదనిపించారు. నార్త్‌జోన్ బౌలర్లు మార్కండే, రిషీ ధావన్‌కు రెండేసి, సందీప్, యాదవ్, నితీశ్ రాణా, ధగర్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన నార్త్‌జోన్ జట్టు 19ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 55పరుగులు చేసి ఓటమి కోరల్లో నిలిచిన దశలో భారీ వర్షంతో మ్యాచ్ అర్థాంతరంగా నిలిచిపోయింది. దీంతో ఇరుజట్లకు చెరో పాయింట్ కేటాయించారు. క్యాప్ గ్రౌండ్-2లో జరిగిన రెండో మ్యాచ్‌లో వెస్ట్‌జోన్ జట్టు 9వికెట్ల తేడాతో నార్త్-ఈస్ట్-జోన్ జట్టుపై విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన నార్త్-ఈస్ట్-జోన్ జట్టు 47ఓవర్లలో 207పరుగులకు కుప్పకూలింది. ఇమిపతి(38), కిషాంగ్బామ్(30) టాప్‌స్కోరర్స్. నగ్వాస్వల్లాకు మూడు, శివమ్ దూబే, ములానీకి రెండేసి వికెట్లు దక్కాయి. ఆ లక్ష్యాన్ని వెస్ట్‌జోన్ జట్టు 25.1ఓవర్లలో హర్వాక్ దేశాయ్(85)వికెట్ కోల్పోయి ఛేదించింది. ప్రియాంక్ పంచల్(99నాటౌట్) సెంచరీకి చేరువలో ఉండగా మ్యాచ్ ముగిసింది.క్యాప్-3లో జరిగిన మరో మ్యాచ్‌లో ఈస్ట్‌జోన్ జట్టు 6వికెట్ల తేడాతో సెంట్రల్‌జోన్‌పై గెలిచింది. సెంట్రల్ జోన్ జట్టు 50ఓవర్లలో 207పరుగులకు ఆలౌట్ కాగా.. ఈస్ట్‌జోన్ జట్టు 46.1ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 208పరుగులు చేసి గెలిచింది. బుధవారం జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లలో నార్త్ జోన్ జట్టు సెంట్రల్‌జోన్‌తో, వెస్ట్‌జోన్ జట్టు సౌత్‌జోన్‌తో, ఈస్ట్‌జోన్ జట్టు నార్త్-ఈస్ట్-జోన్ జట్లతో తలపడనున్నాయి.



మయాంక్ అగర్వాల్(64)

'పోలవరం బ్యాక్‌వాటర్స్'పై అధ్యయనం చేయాలి

- పిపిఎకు తెలంగాణ ఇఎన్‌సి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలవరంపై బ్యాక్‌వాటర్స్ ప్రభావంపై అధ్యయనం చేయాలని రాష్ట్ర సాగునీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ సి మురళీధర్ పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పిపిఎ)కు సోమవారం ప్రత్యేకంగా లేఖ రాశారు. సర్వే చేయడానికి గతంలో ఒప్పుకున్న ఎపి సర్కారు, ఇప్పుడు జాప్యం చేయడం సరికాదన్నారు. 2016 నుంచి లేఖలు రాస్తున్నా పట్టించుకోకపోవడం అన్యాయమని అభిప్రాయపడ్డారు. అధ్యయనం చేయడంలో ఆలస్యం మూలంగా నష్టం జరుగుతుందని గుర్తుచేశారు. బ్యాక్‌వాటర్స్ మూలంగా ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. గత ఏడాది కేంద్ర జలశక్తి శాఖ ఆదేశాలు ఇచ్చినా దృష్టిపెట్టడం లేదని గుర్తు చేశారు. గతంలో రాష్ట్రంలోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సైతం సుప్రీంకోర్టుకు వెళ్లాయయని చెప్పారు. ఆ మేరకే కేంద్రం ఆదేశాలిచ్చిందన్నారు. సారపాక ఐటిసి, మణుగూరు హెచ్‌డబ్ల్యుపి, భద్రాచలం పట్టణానికి ముప్పు ఉందన్నారు. 28 వేల ఎకరాలు మునిగిపోయే ప్రమాదముందని ఎప్పటికప్పుడు చెబుతున్నామని వివరించారు. ప్రస్తుత భారీ వర్షాల నేపథ్యంలో సమస్యలు తలెత్తె అవకాశం ఉందని, అలాగే గోదావరిలో వరద బాగా వస్తోందని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి అధ్యయనం చేయాలని కోరారు. గతంలో సంయుక్త సర్వే చేయాలని కోరినట్టు లేఖలో పేర్కొన్నారు. ఇకపోతే సమాచారం అడిగినా ఇవ్వడం లేదని సిడబ్ల్యుసికి గతంలో లేఖ రాసిన సంగతి తెలిసిందే. ముందుగా చెప్పినా సంయుక్త సర్వే చేయలేదని, వర్షాకాలం ప్రారంభమైతే సర్వే చేయడానికి అనేక ఆటంకాలు ఎదురవుతాయని ముందే చెప్పామని అన్నారు.

మణిపూర్ అల్లర్లకు కేంద్ర బిజెపి ప్రభుత్వమే కారణం

- ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ ఫోరం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మణిపూర్ అల్లర్లకు కేంద్రం, ఆ రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వమే కారణమని ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ ఫోరం అధ్యక్షులు నేతి మహేశ్వరరావు తెలిపారు. సోమవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి బొప్పన రాజశేఖరరావు, జాయింట్ సెక్రటరీ ఖాజారావు, సభ్యులు జొన్నలగడ్డ శ్రీనివాసరావుతో కలిసి ఆయన మాట్లాడారు. బిజెపి అధికారంలో ఉంటే మున్ముందు మణిపూర్ లాంటి ఘటనలు ఇంకా ఎన్నో చూడాల్సి వస్తుందని తెలిపారు. అత్యంత క్రూరమైన ఘటనలు మణిపూర్లో జరిగాయని, బిజెపి ప్రభుత్వం వాటిని నివారించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. జరిగిన తీరును బట్టి చూస్తే ప్రభుత్వమే దగ్గరుండి ఘర్షణలు రెచ్చగొట్టినట్లు కనిపిస్తోందని తెలిపారు. అక్కడి వీడియోలను చూస్తుంటే హిట్లర్ యూదులను చంపినట్లు ఉందని అన్నారు. మణిపూర్ ఘటనలో దీర్ఘకాలిక కుట్రకోణం దాగుందని పేర్కొన్నారు. మెజారిటీ వర్గమైన మెయితీలను ఎస్‌సి, ఎస్‌టిల్లో చేర్చడానికి బిజెపి మేనిఫెస్టోలో పెట్టిందా? అని ప్రశ్నించారు. 55కు పైగా టెర్రరిస్టు గ్రూపులు ఉన్న ప్రాంతాల్లో అత్యంత సున్నితమైన నిర్ణయం తీసుకోబోయే సమయంలో ఆయుధ ఎఫ్ఎస్‌పిఎ చట్టాన్ని తీసేయడం ఉద్దేశం ఏమిటో చెప్పాలన్నారు. బలమైన వ్యవహారంలో సింగిల్ బెంచ్ తీర్పు ఇవ్వడం ఏమి న్యాయమని ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వమే మైనార్టీ తెగమీద ఉద్దేశపూర్వక లక్ష్యంతో పనిచేసినట్లు కనిపిస్తోందని పేర్కొన్నారు. ఓట్లకోసం మైనార్టీలను లక్ష్యంగా వాడుకుంటున్నారని తెలిపారు. గోద్రా అల్లర్లు కూడా ఇదే తరహాలో చేశారని, అక్కడ మతాలను విడగొట్టి రాజకీయంగా లబ్ధి పొందారని విమర్శించారు. దేశ ప్రధాని కాశ్మీర్‌ఫైల్స్, కేరళ ఫైల్స్ చూడండని చెప్పడం సరైంది కాదని విమర్శించారు. తెగల మధ్య గొడవని, మతాల మధ్య గొడవగా చూపించడం అత్యంత నీచమని పేర్కొన్నారు. పార్టీలు మతాన్నో, వర్గాన్నో నెత్తినపెట్టుకుని పనిచేయడం సరైన పద్ధతి కాదని అన్నారు.



మహిళల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

- ఆసియా క్రీడలకు జట్టును ప్రకటించిన ఎఐఎఫ్ఎఫ్
- 30నుంచి భువనేశ్వర్‌లో శిక్షణా శిబిరం

భువనేశ్వర్: చైనాలోని గ్వాంఝూ వేదికగా జరిగే ఆసియా క్రీడల్లో ప్రాతినిధ్యం వహించే భారత మహిళల ఫుట్‌బాల్ జట్టును ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్(ఎఐఎఫ్ఎఫ్) సోమవారం ప్రకటించింది. మొత్తం 34మంది ఆటగాళ్ల ప్రోబబుల్స్‌తో కూడిన జట్టును ప్రకటించిన ఎఐఎఫ్ఎఫ్ వీరందరికీ భువనేశ్వర్ వేదికగా జులై 30నుంచి శిక్షణను ఇవ్వనుంది. ఆసియా క్రీడలకు ముందు భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు రెండు సన్నాహక మ్యాచ్‌లను తస్కెంట్‌లో ఆడనుంది. ఇక గ్రూప్-సిలో ఉన్న భారతజట్టు తొలి మ్యాచ్‌ను అక్టోబర్ 26న జపాన్‌తో, 29న వియత్నాంతో, నవంబర్ 1న ఉజ్బెకిస్తాన్‌తో మ్యాచ్‌లను ఆడనుంది. భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు కిర్గిజ్ రిపబ్లిక్‌ను ఓడించడం ద్వారా రౌండ్-2కు అర్హత సాధించింది.

గోల్‌కీపర్లు : సౌమ్య నారాయణస్వామి, మీబమ్ లిథోంగోంబి దేవి, శ్రేయా హుడా.

డిఫెండర్లు : ఆశాలత దేవి, స్వీటీ దేవి, సంజు, రీతు రాణి, రజనా ఛాను, మార్గరేట్, దలిమా ఛిబ్బర్, మనీసా పన్న, అస్టమ్ ఓరోన్, జూలి కిషన్, షిల్కే దేవి, జబమని తుడే.

మిడ్‌ఫీల్డర్లు : ప్రిమాంక దేవి, అంజు తమాంగ్, ఇందుమతి, సంగీత బస్ఫోర్, కాజల్ హబెర్ట్, అసెం రోజా దేవి, కార్తీకా అంగముత్తు

ఫార్వర్డ్స్ : దంగమ్ గ్రేస్, సౌమ్య, మనీషా కళ్యాన్, అపుర్ణ నర్జారీ, నేహా, సుమతి కుమారి, రేణు, కరిష్మా పురుషోత్తమ్, సంధ్యా రంగనాథన్, ప్యారీ కకా, జ్యోతి, ఎన్. బాలాదేవి.

ఐదో రోజు ఆటకు వర్షం అడ్డంకి

మ్యాచ్ రద్దయితే సిరీస్ భారత్ కైవసం

ట్రినిడాడ్: రెండో టెస్టులో ఐదో రోజు ఆటకు వరుణుడు అడ్డంకిగా మారాడు. భారత్ నిర్దేశించిన 365పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో నాల్గో రోజు ఆటలో భాగంగా వెస్టిండీస్ జట్టు 2 వికెట్ల నష్టానికి 76పరుగుల వద్దే ఐదోరోజు ఆట నిలిచింది. రెండో ఇన్నింగ్స్‌ను రెండు వికెట్ల నష్టానికి 181 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన టీమిండియా... వెస్టిండీస్ ముందు 365 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. టీమిండియా ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు యశస్వి జైస్వాల్(38), రోహిత్ శర్మ(57), శుభ్ మాన్ గిల్ (29నాటౌట్), ఇషాన్ కిషన్ (52నాటౌట్) పరుగులు చేశారు. ఛేదన భాగంగా వెస్టిండీస్ జట్టు నాలుగో రోజు ఆట చివరికి రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు కోల్పోయి 76 పరుగులు చేసింది. కెప్టెన్ క్రెయిగ్ బ్రాత్‌వైట్ 28 పరుగులు చేయగా, కిర్క్ మెకెంజీ(0) డకౌట్ అయ్యాడు. వీరిద్దరినీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ పెవిలియన్ పంపాడు. నారాయణ్ చందర్ పాల్ 24, జెర్మెన్ బ్లాక్ వుడ్ 20 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. వెస్టిండీస్ గెలవాలంటే ఇంకా 289 పరుగులు చేయాల్సి ఉంది.

శ్రీలంక 166ఆలౌట్

పాకిస్తాన్‌తో రెండో, చివరి టెస్ట్

కొలంబో: రెండోటెస్ట్‌లో పాకిస్తాన్ జట్టు పట్టు బిగించింది. సోమవారం నుంచి ప్రారంభమైన రెండో టెస్ట్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 166పరుగులకే ఆలౌటైంది. ఆర్బార్ అహ్మద్(4/69), నసీమ్ షా(3/41), షాహిన్ షా అఫ్రిది(1/44) బౌలింగ్‌లో రాణించగా.. ధనుంజయ(57), ఛండీమాల్(34), మెండిస్(27), కరుణరత్నే(17) రెండంకెల స్కోర్ చేశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్తాన్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 2వికెట్ల నష్టానికి 145పరుగులు చేసింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68